ప్రజాశక్తి

సోమవారం 26 మే 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఉక్కు పిడికిలి



పాత గాజువాక జంక్షన్‌లో జరిగిన బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో హాజరైన ఉక్కు కాంట్రాక్టు కార్మికులు

అక్రమ తొలగింపులపై ఉక్కు కాంట్రాక్టు కార్మికులు పిడికిలి బిగిస్తున్నారు. ఈ నెల 20 నుంచి సమ్మె చేస్తున్నా స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం స్పందించకపోవడంతో ఆదివారం పారిశ్రామిక వాడ గాజువాకలో వారు భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్న ఈ ర్యాలీ ప్రభుత్వానికి హెచ్చరిక వంటిదని పలువురు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల జోలికొస్తే ఊరుకునేది లేదని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు సహా కార్మిక నేతలంతా హెచ్చరించారు. గాజువాక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తక్షణం జోక్యం చేసుకొని సమ్మె పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. పోరాటాన్ని నిర్వీర్యం చేయాలని ఎవరు ప్రయత్నాలు చేసినా వారి ఆటలు సాగవని తేల్చిచెప్పారు. కార్మిక వర్గం తలచుకుంటే ఎలా ఉంటుందో ప్రభుత్వానికి తెలుసునన్నారు.

(ప్రధాన వార్త మెయిన్‌లో..)



ర్యాలీ అగ్రభాగాన జగ్గునాయుడు, కార్మిక సంఘాల నేతలు

పెరుగుతున్న రిజిస్ట్రేషన్లు

- రూ.374 కోట్లు 35 లక్షల ఆదాయ లక్ష్యంతో పని
- కొనుగోలుదారులు డాక్యుమెంట్లను నిశితంగా పరిశీలించాలి
- 'ప్రజాశక్తి'తో అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్ మన్మధరావు





ప్రజాశక్తి - అనకాపల్లి

'ఉమ్మడి విశాఖ జిల్లా విభజన అనంతరం అనకాపల్లి జిల్లాలో రిజిస్ట్రేషన్ల సంఖ్య నానాటికీ పెరుగుతూ వస్తోంది. అందుకు తగ్గట్టుగానే ఆదాయం కూడా జిల్లాకు సమకూరుతోంది' అని అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్ మన్మధరావు అన్నారు. ఆయన్ని 'ప్రజాశక్తి' పలకరించగా జిల్లాలో ఉన్న 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన లావాదేవీలపైనా, డాక్యుమెంట్లపైనా పలు విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

అనకాపల్లి జిల్లాలో ఎక్కడెక్కడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి?

అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి, చోడవరం, కె.కోటపాడు, కోటవురట్ల, మాడుగుల, నర్సీపట్నం, నక్కపల్లి, సబ్బవరం, యలమంచిలి, లంకెల పాలెంల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి.

2024 -25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన లావాదేవీలు ఎలా ఉన్నాయి?

2024 -25 ఆర్థిక సంవత్సరంలో 67 వేలా 943 డాక్యుమెంట్లపై మొత్తం లక్ష్యం 408 కోట్లా 25 లక్షలా 78 వేలు కాగా రూ.270 కోట్లా 73 లక్షలా 80 వేల ఆదాయం సమకూరింది. అనుకున్న లక్ష్యంలో 66.32 శాతం సాధించాం.

2025 - 26 లక్ష్యాల గురించి వివరిస్తారా?

అనకాపల్లి కార్యాలయ పరిధిలో రూ.94.04 కోట్లు, చోడవరంలో రూ.20.82 కోట్లు, కె.కోటపాడులో రూ.10.23 కోట్లు, కోటవురట్లలో రూ.16 కోట్లు 2 లక్షలు, మాడుగులలో మిగతా 2లో..

ఆట స్థలాలు ఇలా.. ఆడేది ఎలా..

వార్త 7లో..

యోగాంధ్ర పేరుతో మభ్యపెట్టొద్దు

వార్త 5లో..

రాజకీయ కుట్రతోనే ఎండియులు రద్దు

వార్త 6లో..



పరీక్షా కేంద్రానికి వస్తున్న అభ్యర్థులు

ప్రశాంతంగా యుపిఎస్‌సి ప్రిలిమ్స్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో ఆదివారం నిర్వహించిన యుపిఎస్‌సి ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ నగరంలో కొన్ని పరీక్షా కేంద్రాలను సందర్శించి, ఏర్పాట్లను సమీక్షించారు. ఉదయం దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కాలేజీ, అక్కయ్యపాలెం కేంద్రీయ విశ్వవిద్యాలయం కేంద్రాలను ఆయన పరిశీలించారు. పరీక్షలు సజావు నిర్వహణ, అభ్యర్థులకు అందుతున్న మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. కేంద్రాల్లో భద్రత, పర్యవేక్షణ, అభ్యర్థులకు తాగునీరు, విశ్రాంతి ప్రాంతాలు, సూచన బోర్డులు వంటి ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, నిబంధనలకు అనుగుణంగా జరిగాయని ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట రెవెన్యూ, పోలీస్, విద్యా శాఖల అధికారులు ఉన్నారు.

కగార్ హత్యలపై

సుప్రీం సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

27 మందిని బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపడాన్ని ఖండించారు. ఆపరేషన్ కగార్ పేరుతో సాగించిన హత్యలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు నిర్వహించాలని వక్తలు డిమాండ్ చేశారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్, పిఒడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, సిపిఎం జిల్లా నాయకులు పి.మణి, మిగతా 2లో..



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న సంఘాల నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కగార్ హత్యలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని ఆదివారం జగదాంబ దరి సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన ప్రజా, పౌర, మానవ, కార్మిక, మహిళ అఖిలపక్షాల నేతల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి నంబాళ్ల కేశవరావు సహా మరో

మొదటి పేజీ తరువాయి..

కగార్ హత్యలపై సుప్రీం సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి, మానవ హక్కుల వేదిక తెలుగు రాష్ట్రాల కన్వీనర్ వివిఎస్.కృష్ణ, మహిళా చేతన కార్యదర్శి కె.పద్మ, చైతన్య మహిళా సమాఖ్య కార్యదర్శి డి.లలిత, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.చంద్రశేఖర్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు రామచంద్రరావు డిమాండ్ చేశారు. ప్రస్తుత తరుణంలో శాంతి చర్చలకు సిద్ధపడుతున్న మావోయిస్టు పార్టీతో చర్చించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఏకపక్ష ఎన్‌కౌంటర్లు సరికాదన్నారు. ఆదివాసీలకు పూర్తిగా రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది కాదా ? అని ప్రశ్నించారు. పర్యావరణానికి హాని కలిగిస్తూ దేశ ప్రజల సొంత ఆస్తులను కార్పొరేట్లకు అప్పగించాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇదంతా చేస్తోందని విమర్శించారు. పహల్గాం ఉగ్రదాడిలో నేరస్తులను పట్టుకోకుండా పాకిస్తాన్‌పై దాడి చేయడం తెలిసిందేనని, అదే విధంగా ఇక్కడ కూడా ఆదివాసీల పేరుతో మావోయిస్టులను హత్య చేస్తున్నారని అన్నారు. నారాయణపూర్‌లోని ఎన్‌కౌంటర్ బూటకమని, ఫాసిస్టు నిర్బంధానికి నిదర్శనమని అన్నారు. కేశవరావు మృతదేహాన్ని అప్పగించాలని హైకోర్టు ఆదేశించిన విషయాన్ని గుర్తుచేశారు. శ్రీకాకుళం జిల్లా పోలీసుల నుంచి కేశవరావు మృతదేహానికి అంత్యక్రియలు జరగకుండా ఆటంకం కలిగించే పరిస్థితి ఉందన్నారు. కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించి అంత్యక్రియలు జరిగేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చూడాలని డిమాండ్ చేశారు.

పెరుగుతున్న రిజిస్ట్రేషన్లు

రూ.7 కోట్లా 15 లక్షలు, నర్సీపట్నంలో రూ.25 కోట్లా 47 లక్షలు, నక్కపల్లిలో రూ.38 కోట్లా 52 లక్షలు, సబ్బవరంలో రూ.37 కోట్లా 21 లక్షలు, యలమంచిలిలో రూ.58 కోట్లా 71 లక్షలు, లంకెలపాలెంలో రూ.66 కోట్లా 18 లక్షలు.. మొత్తం 374 కోట్లా 35 లక్షల లక్ష్యం పెట్టుకున్నాం. అందులో ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.25 కోట్లు, మే నెలలో సుమారు 30 కోట్లు వచ్చే అవకాశముంది.

ఆస్తుల కొనుగోలుదారులకు మీరిచ్చే సలహా ఏంటి ?

ఇటీవల ఆస్తుల కొనుగోలు సందర్భంగా పలు వివాదాలు తలెత్తుతున్నాయి. వాటిని నివారించేందుకు కొనుగోలుదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యవసాయ భూమిగానీ, సైట్లుగానీ కొనేటప్పుడు అందుకు సంబంధించిన లింకు డాక్యుమెంట్లు, ఎన్కంబరెన్స్ సర్టిఫికెట్‌ను చూసి సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి సందేహాలను నివృత్తి చేసుకోవాలి. అలాగే అన్నదమ్ముల సెటిల్మెంట్స్, పార్టిషన్ డీడ్స్ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అప్పుడే మ్యూటేషన్ అవుతుంది. అన్ రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు మ్యూటేషన్ అవ్వవు. ఈ విషయాన్ని కొనుగోలుదారులు గమనించాలి.

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ సొంత భవనం ఇప్పట్లో నిర్మించే అవకాశం ఉందా ?

జిల్లా రిజిస్టర్ కార్యాలయానికి సంబంధించి సొంత స్థలం ఉంది. సొంత భవనం నిర్మాణానికి 2016లోనే కోటీ 20 లక్షలతో ప్రతిపాదనలు పంపారు. అయితే అనివార్య కారణాలవల్ల నిర్మాణం ప్రారంభించలేదు. స్థానిక పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యుల సహకారంతో భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టాలని అనుకుంటున్నాం.

ప్రజాసేవతో జీవితం సార్థకత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవ, ప్రగతి పనులు చేసిన నాయకుని జీవితం సార్ధకత అవుతుందని, ఆ కోవలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ఎ.రెహమాన్ ధన్యులని దక్షిణ ఎమ్మెల్యే సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు .ఆదివారం మెయిన్ రోడ్‌లోని శ్రీ క్రాంతి పిక్చర్స్ కన్వెన్షన్ హాల్లో వుడా మాజీ చైర్మన్ డాక్టర్ రెహమాన్, షిరీన్ రెహమాన్ దంపతుల 75 వసంతాల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ, ఎమ్మెల్యేగా, వుడా చైర్మన్‌గా ప్రజాసేవలో రెహమాన్ తనకు తానే సాటి అనిపించుకున్నారన్నారు. .చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా డాక్టర్ షిరీన్ రెహమాన్ ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారని, దంపతులిద్దరూ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ రాజకీయాల్లో డబ్బు సంపాదన ముఖ్యం కాదని, నిజాయితీగా పనిచేసినప్పుడే ప్రజల ఆదరణ చూరగొంటారన్నారు. రెహమాన్‌కు ఎమ్మెల్యే టిక్కెట్ ఇప్పించేందుకు అప్పట్లో తాము పడ్డ శ్రమను గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఎ.రెహమాన్ మాట్లాడుతూ ప్రజల మనసులను గెలుచుకుని వారికి సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉందన్నారు. చైతన్య స్రవంతి అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రెహమాన్ మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఇన్ని కార్యక్రమాలు చేపట్టడానికి ప్రజాసహకారం ఎంతో ఉందన్నారు.కార్యక్రమంలో తెలుగు యువత మాజీ అధ్యక్షులు నార్నె నరసింహారావు, లీడర్ దినపత్రిక సంపాదకులు వి.వి. రమణమూర్తి, కూటమి నాయకులు డబ్ల్యూ. భాస్కరరావు, అత్తిలి శంకర్రావు, గొలగాని రవీశ్వరరావు, కృష్ణారెడ్డి, విన్నర్ ఎంటర్ప్రైజెస్ ఎండి ఫర్హాన్, డి.భారతి, అబ్దుల్ చిన్న రహమాన్, హోటల్ బుదిల్ పార్క్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



రెహమాన్ దంపతులను సత్కరిస్తున్న ప్రముఖులు

'మాల్స్'లో వెట్టిచాకిరి..!

◆ రోజుకు 10 నుంచి 12 గంటలు పని

◆ వేతనం రూ.10 వేలలోపే



ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: గ్రేటర్ విశాఖ నగరంలో పెద్ద పెద్ద షాపింగ్‌మాల్స్, మార్ట్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఐదేళ్ల క్రితంతో పోలిస్తే ఇప్పుడు నగరంలో ఏ ప్రాంతంలో చూసినా పెద్దపెద్ద షాపింగ్‌మాల్స్ కనిపిస్తున్నాయి. జగదాంబ జంక్షన్, డాబాగార్డెన్స్, దొండపర్తి, ద్వారకానగర్, ఆశీలుమెట్ట, ఎంవిపికాలనీ, మద్దిలపాలెం, సిరిపురం జంక్షన్, సీతమ్మధార, గోపాలపట్నం, గాజువాక, సుజాతనగర్ వంటి ప్రాంతాల్లో పెద్దపెద్ద షాపింగ్‌మాల్స్, మార్ట్‌లు ఉన్నాయి. గత రెండు మూడేళ్లుగా ఈ ప్రాంతాల్లో కొత్తగా షాపింగ్‌మాల్స్ వచ్చాయి. వీటిలో కొన్ని బహుళ అంతస్తులతో వందలాదిమంది కార్మికులు, ముఖ్యంగా మహిళలు పనిచేస్తున్నవి ఉన్నాయి. విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్ లో అతిపెద్ద నగరం. సుమారు 25 లక్షల జనాభా కలిగి ఉంది. పైగా ఆర్థిక, పారిశ్రామిక నగరంగా పేరు ఉంది. దీంతో ఈ నగరంలో షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేయడం లాభసాటిగా ఉంటుందని భావించి ఇక్కడ పెద్ద పెద్ద సంస్థలు షాపింగ్‌మాల్స్ ఏర్పాటు చేసాయి. కొన్నిసంస్థలు ఇదే నగరంలో ఎంపిక చేసిన ప్రదేశాలలో అదనంగా అదే పేరుతో షాపింగ్ మాల్స్‌ను ఏర్పాటు చేశాయి. సిఎంఆర్, లక్కీ, ఎస్ఆర్, ఆర్ఎస్, అలాగే ఖజానా, శ్రీవైభవ్, శ్రీ కామేశ్వరి, జోయాలుక్కాస్, సౌందర్య, బజాజ్, డీ మార్ట్ వంటి షాపింగ్‌మాల్స్ ఒకటి కంటే అదనంగా నగరంలో ఏర్పాటు చేశారు. బ్రాండెడ్ బాటా వంట షూ స్టోర్స్ బ్రాంచీలు కూడా ఉన్నాయి. ఇవి కాకుండా విశాఖపట్నం పోర్టు హాస్పటల్ ప్రాంతంలో జాతీయ స్థాయిలో పెద్దదైన ఒక సంస్థ షాపింగ్‌మాల్ నిర్మాణంలో ఉంది. భీమిలి ప్రాంతంలో కూడా ఇదే స్థాయిలో మరొక భారీ షాపింగ్ మాల్ నిర్మాణంలో ఉంది. ఇక షాపింగ్ మాల్స్‌లో పని చేసేందుకు స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, ప్రాంతాల నుంచి మహిళలు, యువకులు వస్తున్నారు. వీరిలో అత్యధికంగా మహిళలు ఉంటున్నారు. ప్రతి షాపింగ్‌మాల్, మార్ట్‌ల లోనూ వందల సంఖ్యలో ఉద్యోగులు పని చేస్తున్నారు. మాల్స్‌లో ఎక్కడా కార్మిక చట్టాలు అమలు కావడం లేదు. మాల్స్ యాజమాన్యాలు పాటిస్తున్నదే చట్టం. వారు అవలంభిస్తున్న నిబంధనలే శిరోధార్యం అన్నట్లు పరిస్థితి తయారైంది. అధికారుల తనిఖీలు పూర్తిగా కొరవడటంతో మాల్స్‌లో పని చేసే ఉద్యోగులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. సరైన ఉపాధి లేకపోవడంతో యువత మాల్స్‌లో పని చేసేందుకు వస్తున్నారు. దీన్ని అదునుగా తీసుకుని మాల్స్ యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. ముఖ్యంగా పనిగంటల విషయంలో నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కుతున్నారు. రోజుకు 10 నుంచి 12 గంటలు పని చేయిస్తున్నారు. ఉదయం 10 గంటలకు మొదలైతే రాత్రి 10 గంటల వరకూ ఉంచుతున్నారు. ఉద్యోగులకు వేతనాలు సైతం అత్యంత దారుణంగా ఇస్తున్నారు. రూ.7 వేల నుంచి రూ.10వేలలోపు వేతనం తీసుకునే ఉద్యోగులే అధికంగా ఉంటున్నారు. మాల్స్‌లో పనిచేసే ఉద్యోగులకు కార్మిక చట్టాల నిబంధనలను అమలు చేయాల్సి ఉంది. ఎక్కడా అటువంటి పరిస్థితి లేదు. విశాఖ నగరంలో పరిస్థితి మరింత దారుణంగా ఉందనే విమర్శలున్నాయి.

చట్టంలోని నిబంధనలు పట్టవా..!

కార్మికచట్టాల ప్రకారం రోజుకు ఎనిమిది గంటలు మాత్రమే పని చేయించాలి. అంతకుమించి ఎక్కువ పనిగంటలు చేస్తే ఓటి కింద రెట్టింపు వేతనం చెల్లించాలి. ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. ప్రతి ఉద్యోగిని చేర్చుకునేటప్పుడు అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వాలి. కనీస వేతనం చెల్లించాలి. పిఎఫ్, ఇఎస్ఐ వర్తింపజేయాలి. వెల్ఫేర్ ఫండ్ కట్టాలి. ప్రతి ఏటా బోనస్ చెల్లించాలి. ఐదేళ్లు దాటిన ఉద్యోగులకు గ్రాట్యుటి ఇవ్వాలి. పురుష, మహిళా ఉద్యోగులకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి. మహిళలకు ప్రసూతి సెలవులు అమలు చేయాలి. క్యాజువల్ లీవులు ఇవ్వాలి. మధ్యాహ్న భోజనం చేసేందుకు ప్రత్యేక సదుపాయం కల్పించాలి. అయితే మాల్స్‌లో ఎక్కడా ఈ నిబంధనలు అమలు కావడం లేదు. కొన్ని మాల్స్ యాజమాన్యాలు పిఎఫ్, ఇఎస్ఐ వంటివి పది, ఇరవై మంది ఉద్యోగులకు అమలు చేసి వాటినే రికార్డుల్లో చూపిస్తున్నాయి. ఆదివారం, పండుగ దినాల్లోనూ పని చేయిస్తున్నా అదనంగా ఎటువంటి వేతనమూ ఇవ్వడం లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిలబడి పని చేస్తుండటంతో మోకాళ్ల నొప్పులతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు వారిని వెంటాడుతున్నాయి. ఉద్యోగులు ఎవరైనా ప్రశ్నిస్తే తొలగించడం గాని, వారి నుంచి తీసుకున్న సర్టిఫికెట్లు ఇచ్చేందుకు నానా ఇబ్బందులు పెట్టే పరిస్థితి ఉన్నట్లు చెబుతున్నారు. అధికారుల తనిఖీలు లేకపోవడంతో మాల్స్‌లో నిబంధనలు అమలుకాని పరిస్థితి నెలకొంది.

కుండలు, కూజాలకు పెరిగిన గిరాకీ



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి పాత్రలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎండల తీవ్రత అధికం కావడంతో, నగరంలో మట్టి కుండలు, కూజాలకు గిరాకీ పెరిగింది. వీటి నీటి వాడకం ఆరోగ్యానికి మంచిదని వైద్యులు కూడా చెబుతుండడంతో వీటిని కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో ఆధునిక కాలంలో కూడా పేదవాడి ఫ్రిజ్‌కు ఆదరణ తగ్గలేదని చెప్పవచ్చు. నగరంలోని అల్లిపురం కుమ్మరవీధి, చౌల్ట్రీ సమీపంలో విశ్వేశ్వరాలయం ఎదురుగా కుమ్మరి వీధి, పూర్ణా మార్కెట్, దొండవర్తి కుమ్మరివీధి తదితర ప్రాంతాల్లో మట్టికుండలు, కూజాల అమ్మకాలు చాలా కాలంగా సాగుతున్నాయి. ఎండలు రోజురోజుకీ పెరుగుతుండడంతో ఫ్రిజ్‌లు కొనలేని పేద, మధ్య తరగతి ప్రజలు మట్టికుండలు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ఫ్రిజ్ నీటి కంటే మట్టికుండలో నీరే ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతుండడంతో ఫ్రిజ్‌లు ఉన్నవారు సైతం మట్టి కుండలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. రోజులో ఒక్కో కుటుంబం 5 కుండలు తయారు చేసి ఒక్కో కుండ రూ.130 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. కూజాలు అయితే రూ.150 నుంచి రూ.200 ధరలో అమ్మకాలు చేస్తున్నారు. వేసవి ప్రారంభంలో రోజుకు 20 నుంచి 30 వరకూ అమ్మకాలు జరగ్గా, ఇటీవల రోజుకు సుమారు 50 వరకు మట్టికుండలు విక్రయాలు జరుగుతున్నాయని దొండపర్తి జంక్షన్ లోని ఒక మహిళ వ్యాపారి తెలిపారు. మే నెలలో అమ్మకాలు మరింత పెరుగుతాయని ఆశాభావం వ్యక్తపరిచింది.

మట్టి కుండ నీటితో ఆరోగ్య ప్రయోజనాలు

దాహం తగ్గిస్తుంది. ఎసిడిటి కంట్రోల్ చేస్తుంది. శరీరానికి చల్లదనంతో పాటు రోగ నిరోధక శక్తి పెంచుతుంది.వడదెబ్బ నుంచి రక్షిస్తుంది. మెటబాలిజం మెరుగుపడుతుంది. గొంతు సమస్యలు, జలుబు తగ్గిస్తుంది. టెస్టు స్టెరోన్‌స్థాయి సమతూకం చేస్తుంది. మధుమేహ వ్యాధిని అదుపులో ఉంచుతుంది. కడుపులో ఆమ్లం అధిక ఉత్పత్తిని నిరోధించి, అజీర్ణం సమస్యలను నివారిస్తుంది.

మారని బతుకులు

మూడు దశాబ్దాల క్రితం విశాఖ మహానగరంలో కుండలు తయారు చేసే శాలివాహన కుటుంబాలు 2 వేలకుపైగా ఉండేవి. తయారు చేసిన కుండలను విశాఖ నగరంతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలు,రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేసేవారు. వేసవిలో మినహా మిగిలిన కాలాల్లో కుండలకు తగిన ఆదరణ లేకపోవడంతో కుటీర పరిశ్రమ కుంచించుకుపోయింది. ప్రస్తుతం ఆ సంఖ్య పరిమితంగానే మిగిలింది. అది కూడా విశాఖ నగరంతో పాటు, అనకాపల్లి గాంధీచౌక్ ప్రాంతంలో కుమ్మరివీధి, గుండాల ప్రాంతం, ఎలమంచిలి నియోజవర్గం హరిపాలెం, ఎర్రవరం, పాయకరావుపేట నియోజకవర్గం పరిధిలోని మరికొన్ని గ్రామాలల్లోనే ముట్టికుండల తయారీ ఉంది. దీంతో వేరే ప్రాంతాల నుంచి దిగుబడి చేసుకుని ఇక్కడ విక్రయిస్తున్నారు. ఈ వత్తిని వదిలేసిన కుటుంబాలు ప్రత్యామ్నాయ ఉపాధి వెతుక్కుని జీవనం సాగిస్తున్నాయి. ప్లాస్టిక్, స్టీల్ వస్తువులు రాకతో మట్టి పాత్రలు నిరాదరణకు గురికావడం పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపుతోంది. 50 సంవత్సరాలు దాటిన వృత్తిదారులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని వీరు కోరుతున్నారు.

బాలాజీనగర్‌లో సమస్యల తిష్ట



యాతపేటలో ఇళ్లపై నుంచి ఉన్న విద్యుత్ వైర్లు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు పరిధి బాలాజీనగర్‌లో బోలెడన్ని సమస్యలు నెలకొని ఉన్నాయి. బాలాజీనగర్‌లోని యాత పేటలో సిమెంట్ రోడ్డు మరమ్మతుకు గురైంది. అక్కడున్న కుటుంబాల వాడుక నీరు, వర్షపు నీరు పోయేందుకు వీలుగా పూర్తి స్థాయిలో సిమెంట్ కాల్వ లేదు. దీంతో నీరు ఎటూ వెళ్లక నిల్వ ఉండటంతో అనివార్యంగా మురుగు సమస్య ఏర్పడింది. కాల్వలు లేక ఈ ప్రాంతంలో అనేక చోట్ల మురుగు నీరు నిల్వ ఉంటుంది.

వేలాడుతున్న విద్యుత్ వైర్లు..

వరుసగా ఉన్న ఇళ్లపై చెయ్యెత్తు ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ వైర్లు ఆయా కుటుంబాలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. గతంలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ షాక్‌కు గురై చేతికి తీవ్ర గాయమైనట్లు స్థానికులు చెబుతునానరు. విద్యుత్ వైర్ల కారణంగా ఖాళీ స్థలంలో ఇళ్లు నిర్మించుకో లేక పోతున్నట్లు కొందరు స్థానికులు వాపోయారు.

సరి పడా తాగు నీరు లేదు...

ఇళ్లకు సొంత కుళాయిలున్నా వచ్చే తాగు నీరు ఎటూ చాలడం లేదని స్థానిక మహిళలు చెబుతున్నారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి గంట వరకు నీరు సరఫరా అవుతుందని వివరించారు. గంట సమయంలో 5 బిందెలకు మించి నీరు రావడం లేదని మహిళలు చెప్పారు. బంధువులు, స్నేహితులు వస్తే తాగు నీరు చాలక క్యాన్ల ద్వారా కొని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఉన్న చేతి బోరు కొంత కాలంగా మరమ్మతుకు గురైందని వారు వివరించారు.

వీధి దీపాలు లేక ఇక్కట్లు...

వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. సరిపడా విద్యుత్ స్తంభాలు లేవని, ఇదే విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులకు పలు మార్లు చెప్పినా ఇప్పటికీ స్పందన లేదని అంటున్నారు స్థానికులు. ఈ ప్రాంతంలో ఎక్కువ మంది గీత కార్మిక కుటుంబాలు, పేద, సామాన్య కుటుంబాలే ఉన్నాయి.



మూలకు చేరిన బోరు

సమస్యలపై ఆందోళనలు..

ఈ ప్రాంతంలో మార్చి 26వ తేదీన సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో దాదాపు ఇవే సమస్యలు ముందుకొచ్చాయి. తాగు నీరు, మురుగు నీరు, విద్యుత్ తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు దృష్టికి తీసుకొచ్చారు. ఇవే సమస్యలపై ఏప్రిల్ 7వ తేదీన జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. జివిఎంసి సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు అప్పటి జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం కూడా అందజేశారు. విద్యుత్ సమస్యపై ఏప్రిల్ 18వ తేదీన చిట్టివలస విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట స్థానికులు ధర్నా చేశారు. ఆందోళనలు చేసినా సంబంధిత అధికారులు ఇప్పటికీ స్పందించలేదని స్థానిక మహిళలు చెబుతున్నారు.

- కాల్వలు, రోడ్లు లేక మురుగు సమస్య
- ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ వైర్లు
- వీధి దీపాలు లేక ఇక్కట్లు



యాతపేటలో నిల్వ ఉన్న మురుగు నీరు

విద్యుత్ వైర్లు తొలగించాలి

తమ ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ వైర్లను తొలగించాలి. ఇంటి మేడపై బట్టలు ఆరేసుకునేందుకు నిత్యం భయపడుతున్నాం.



రీసు లత
యాతపేట, బాలాజీనగర్

విద్యుత్ స్తంభాలు వెయ్యాలి

విద్యుత్ స్తంభాలు లేక వీధి దీపాలు వేయలేని పరిస్థితి ఉంది. చీకటి పడితే అనేక ఇబ్బందులు పడుతున్నాం.



రీసు నరసయ్యమ్మ
యాతపేట, బాలాజీనగర్

సిమెంట్ కాల్వలు నిర్మించాలి

సిమెంట్ రోడ్డు మరమ్మతుకు గురైంది. రోడ్డుకు నిర్మించిన కాల్వకు కొనసాగింపు లేదు. దీంతో మురుగు నీరు పోయే మార్గం లేదు. వాడుక, వర్షపు నీరు నిల్వ ఉండడంతో రాత్రి వేళల్లో దోమలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మరో వైపు పిచ్చి మొక్కలు, ముళ్ళ పొదలు ఏపుగా పెరిగి ఉన్నాయి. పాములు వస్తున్నాయి. భయమేస్తుంది.



రీసు శాంతమ్మ
యాతపేట, బాలాజీనగర్

నేరాలు ఘోరాలు

ఆటోను ఢీకొట్టిన కారు : ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : అతివేగంతో వచ్చిన కారు ఆటోను ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించి ట్రాఫిక్ ఎస్ఐ ఉమామహేష్ కథనం ప్రకారం... శనివారం అర్ధరాత్రి దొండపర్తి నుంచి వేగంగా వస్తున్న కారు దాలిరాజు సూపర్ మార్కెట్ వద్ద ఆటోను ఢీకొట్టింది. ఆటోలో ఉన్న ఆరుగురిలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గాయాలపాలైన వారిని చికిత్స నిమిత్తం కేర్ ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ కాశీరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బావిలో జారిపడి బాలుడు మృతి

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని జి జగన్నాధ పురంలో బాలుడు ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. జగతా గంగాద్రి సాయి గణేష్ (16) ఆదివారం పశువులు మేపేందుకు పొలానికి వెళ్ళాడు. బాలుడుకు దాహం వేయడంతో పొలంలో ఉన్న నేల బావి వద్దకు వెళ్లి చేదతో నీరు తోడుతుండగా ప్రమాదవశాత్తు బావిలో పడిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి నీటిలో మునిగిన బాలుడిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలుడు తండ్రి జగతా శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. బాలుడు మృతితో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సేంద్రియ మామిడి పండ్ల మేళాకు మంచి స్పందన

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాలాక్ష్మినగర్‌లోని బివికె కళాశాలలో ఈ నెల 24, 25 తేదీల్లో రెండో పర్యాయం నిర్వహించిన సేంద్రియ మామిడి పండ్ల మేళాకు విశేష స్పందన లభించిందని గో, ప్రకృతి ఆధారిత రైతుల సంఘం కార్యదర్శి చవ్వాకుల అశోక్ తెలిపారు. అరుదైన మామిడి రకాలను రైతులు సేంద్రియ పద్ధతుల్లో పండించి తీసుకొచ్చారని వివరించారు. ఆరోగ్యకరమైన మామిడి పండ్ల మేళాకు సహకారం అందించిన వారిందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అరుదైన మామిడి రకాలు ఈ మేళా ద్వారా నగరవాసులకు పరిచయమయ్యాయని, ఇవన్నీ రసాయనాలు లేకుండా సేంద్రియంగా పండించినవని తెలిపారు. మన దేశంలో అనేక రకాల దేశీయ మామిడికాయలు ఉన్నాయని, వాటిని కాపాడుకోవడం మన బాధ్యత అని, విశాఖ వాసులు బాగా ఆదరిస్తున్నారని మేళాలో పలు రకాల మామిడిపండ్లను అందించిన సేంద్రియ రైతు పేరి రామకృష్ణమూర్తి పేర్కొన్నారు. పంచదార కలిశాలు, పండూరి మామిడి, కొత్తపల్లి కొబ్బరి, స్వాగతం, అమృతం, పాపారాజు గోవా, నాగులపల్లి రసాలు, హైదర్ సాయిబు, జహంగీర్, పెద్ద రసాలు, చిన్న రసాలు, బంగినపల్లి, సువర్ణ రేఖ, కొబ్బరి అంటు, ముంత మామిడి, సన్నాకులు, దొండకాయ, ఇమామ్ పసంద్ తదితర రకాలు ఈ మేళాలో కొనుగోలు చేసి నగర వాసులు రుచి చూశారని తెలిపారు. విశాఖవాసులు అందించిన సహకారంతో భవిష్యత్తులో మరిన్ని సేంద్రియ పంటలను ఈ రకమైన సంతల ద్వారా విశాఖ వాసుల ముందు ఉంచుతామని నిర్వాహకులు తెలిపారు.



మేళాలో ఏర్పాటుచేసిన మామిడి పండ్లు

వరి విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ పంటకు వివిధ రకాల వరి విత్తనాలు వారం రోజుల్లోగా రైతు భరోసా కేంద్రాలకు చేరుతున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎం.వెంకటాచలం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీకి రూ.5 చొప్పున బస్తాకు రూ.150 రాయితీతో వరి విత్తనాలను రైతులకు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఎంటుయు రకం 845 క్వింటాళ్లు, సాంభమసూరి 8 క్వింటాళ్లు, సోనామసూరి 350 క్వింటాళ్లు, ఆర్‌జిఎల్ 2537 రకం నాలుగు క్వింటాళ్లు, ఎంటియు 1224 రకం 75 క్వింటాళ్లు, వరితోపాటు వేరుశనగ పంట నిమిత్తం లేపాక్షి రకం వేరుశనగ 15.30 క్వింటాళ్లు వస్తాయని తెలిపారు. విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆకట్టుకున్న నృత్యాలు

ప్రజాశక్తి -మధురవాడ : శిల్పారామంలో నిర్వహించు వారంతపు సాంస్కృతిక కార్యక్రమాలో భాగంగా ఆదివారం సాయంత్రం నటరాజ నాట్య కళ చిన్నారులచే నిర్వహించిన నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. గరుడ గమన, చంద్రచుడా, అయిగిరినందిని, ముద్దుగారే యశోద, స్వాగతం కృష్ణ, నారాయణత్తయినమోనమో, భోశంభో గీతాలకు చిన్నారులు పవిత్ర, మోక్ష జ్ఞాన, లక్ష్మీప్రణతి, జాస్మిక నృత్య ప్రదర్శనలు చేశారు.

మరుగుదొడ్ల పనుల్లో జాప్యం



మధ్యలో నిలిచిపోయిన పనులు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని బాల -బాలికల మరుగుదొడ్ల పునర్నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. రన్నింగ్ వాటర్‌తో మరుగుదొడ్లు ఆధునికీకరణకు సుమారు రూ.4.5 లక్షల జెడ్‌పి నిధులతో నెల రోజులు ముందు పనులు ప్రారంభించారు. శొంఠ్యాం గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ అప్పలరాజుకు పనులు అప్పగించారు. ఆయన పనులు ప్రారంభించారు. ఇంతలో ఆయన అనారోగ్యానికి గురికావడంతో పనులు నిలిచిపోయాయి. వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు ప్రారంభానికి ముందే రన్నింగ్ వాటర్‌తో మరుగుదొడ్లను ఏర్పాటు చేయాల్సి ఉన్నా అర్ధాంతరంగా పనులు ఆగిపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా పంచాయతీ అధికారులు పరిశీలించి ఈ పనులు పూర్తయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఎస్ఎస్ఆర్.మూర్తిని, పంచాయతీ ఇంజినీరింగ్ అధికారి రమ్యను వివరణ కోరగా కాంట్రాక్టర్ అనారోగ్యం భారినా పడిన వాస్తవమేనని, నూతన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించి త్వరగా పనులు పూర్తి చేయడానికి చర్యలు చేపడతామని తెలిపారు.

కో-ఆపరేటివ్ బ్యాంక్ మహాసభ

ప్రజాశక్తి -తగరపువలస : విశాఖపట్నం సహకార బ్యాంకు భీమిలి బ్రాంచి సభ్యుల మహాసభ చిట్టివలస లక్ష్మీ శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. బ్యాంక్ ద్వారా అందజేస్తున్న పథకాలను వివరించారు. బ్రాంచి ఇన్‌ఛార్జి డైరెక్టర్ ఎ.రామకృష్ణారావు మాట్లాడుతూ, 2023 - 24, 2024 - 25 సంవత్సరాల వార్షిక నివేదికను చదివి వినిపించారు. రాబోయే కాలంలో బ్యాంకు ప్రణాళికలు రూపొందించి అమలు చేయనున్నట్లు వివరించారు. బ్యాంక్ ఆడిటర్ వి.చంద్రశేఖర్, బ్రాంచి మేనేజర్ బి.శ్రావణకుమారి, ముఖ్య కార్యనిర్వహణాధికారి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. బ్యాంక్‌కు సుదీర్ఘంగా సేవలందించిన డి.రామకృష్ణారావు, పార్వతి దంపతులను సన్మానించారు.



హాస్టల్ భవనం ప్రారంభంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్

బిసి వెల్ఫేర్ హాస్టల్ ప్రారంభం

ప్రజాశక్తి - గాజువాక : పెదగంట్యాడ మండల పరిధి ఇస్లాంపేటలో నిర్మించిన బిసి వెల్ఫేర్ హాస్టల్‌ను విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్పొరేట్ సంస్థల సిఎస్ఆర్ నిధులు రూ.97 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. ప్రభుత్వ బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యాన విద్యార్థుల ఉన్నత విద్యకు సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ స్టీల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.రవీంద్రనాథ్, అసెట్ డిఎస్.వర్మ, బిసి వెల్ఫేర్ అధికారి శ్రీదేవి, వసతి గృహ సంక్షేమ అధికారులు, స్థానిక గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న చింతలపూడి వెంకట్రామయ్య తదితరులు

పేదలను ఆదుకోవాలి

ప్రజాశక్తి - గాజువాక : పేదలను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని గాజువాక మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య అన్నారు. జివిఎంసి 87వ వార్డు పరిధి కణితి కాళింగవీధిలో స్థానిక వైసిపి నాయకులు ఇల్లపు రాము ఆర్థిక సహాయంతో నిరుపేద మహిళలకు ఆదివారం చీరలు పంపిణీ చేశారు. పేదలను ఆదుకోవడానికి ప్రభుత్వం కూడా సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డి, వార్డు వైసిపి నాయకులు ప్రగడ వేణుబాబు, ఇల్లపు రాము, దుగ్గపు దానప్పలు, బోండా గోవిందరాజులు, మార్పు శేషు, పాల్గొన్నారు.

భావాలను వ్యక్తీకరించే సాధనమే చిత్రకళ

ప్రజాశక్తి - ములగాడ : భాషా భేదాలతో పనిలేకుండా, మనసులోని భావాలను స్పష్టంగా వ్యక్తీకరించే సాధనమే చిత్రకళ అని ప్రముఖ చిత్రకారులు ద్వారపూడి శ్రీనివాస మనోహర్ అన్నారు. మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న బాలల వేసవి శిక్షణ శిబిరంలో ఆదివారం చిత్రకళపై ఆయన శిక్షణ ఇచ్చారు. వివిధ రకాల చిత్రాలను తేలికైన పద్ధతిలో ఎలా చిత్రీకరించాలో బాలలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రకృతి దృశ్యాలపై బాలలు వేసిన చిత్రాలను ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్, జాతీయ సేవా పథకం వాలంటీర్లు సునీత, జ్యోతిర్మయి, గ్రంథాలయ పాఠకులు, చిన్నారులు పాల్గొన్నారు.



ఈసెట్‌లో ఆనందపురం వాసికి మొదటి ర్యాంకు

ప్రజాశక్తి-ఆనందపురం : తెలంగాణా ఈసెట్ ఫలితాలలో ఆనందపురం గుమ్మడివానిపాలెం చెందిన లంక సాయి మొదటి ర్యాంకు, ఆంధ్ర ఈసెట్ ఫలితాలలో 13వ ర్యాంకు సాధించారు. గుమ్మడివానిపాలెం గ్రామానికి చెందిన ఈశ్వరరావు, నాగమణి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సాయి కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కెమికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. ఈసెట్‌లో మంచి ర్యాంకులు సాధించడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. తండ్రి ఈశ్వరరావు శొంఠ్యాం రవిరేష్ పెట్రోల్ బంక్‌లో ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. తల్లి గృహిణి. ర్యాంకు సాధించిన సాయిని మేనమామ గోలజాన రవికుమార్, పలువురు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఆలయాల పేరుతో భూకబ్జాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : మొన్న అమ్మవారి ఆలయం, నిన్న జగన్నాథ స్వామి ఆలయం, ఈ రోజు కన్యాకాపరమేశ్వర ఆలయం అంటూ ఆలయాల పేరుతో ప్రభుత్వ స్థలాలను దర్జాగా కబ్జా చేసి నిర్మాణాలు సాగిస్తున్నారు. ఓట్లు కోసం రాజకీయ నాయకులు అండదండలు ఉండడంతో ఎవరికివారు సామాజిక అవసరాల కోసం ఉంచిన ప్రభుత్వ స్థలాలను దర్జాగా కబ్జా చేస్తున్నారు.

జివిఎంసి 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీ చివరి బస్టాపు సమీపంలో రహదారిని ఆనుకొని ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలంలో శనివారం జగన్నాథ స్వామి ఆలయానికి అని చెప్పి కొంత మంది శాశ్వత నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వారికి పోటీగా ఆదివారం కొంత మంది వైశ్య సంఘాల ప్రతినిధులు కన్యకా పరమేశ్వర ఆలయం నిర్మాణానికి పనులు ప్రారంభించారు. వీరికి ప్రభుత్వం ఎటువంటి స్థలాలు కేటాయించకపోయినా, అధికారులు అనుమతులు మంజూరు చేయకున్నా.. దర్జాగా స్థలాలను కబ్జా చేసి నిర్మాణాలు చేస్తున్నారు. కబ్జాలను అడ్డుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. వీటిని అడ్డుకునేందుకు వెళ్లే సచివాలయ సిబ్బందితో స్థానిక రాజకీయ నాయకులు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కట్టుకోమని చెప్పారని బదులిస్తున్నారని కింది స్థాయి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో ముస్లిం సంఘాలు ప్రార్థనా కార్యక్రమాల కోసం జెండాలు పాతితే జివిఎంసి టాస్క్ ఫోర్స్ సిబ్బంది వచ్చి తొలగించారని ముస్లిములు చెబుతున్నారు. ఇలా ఎవరికి వారు ఆలయాల పేరు చెప్పి ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటూ పోతే భవిష్యత్తులో సామాజిక అవసరాల కోసం స్థలాలు ఉండవని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కబ్జాల పర్వాలకు అడ్డుకట్ట వేయాలని కోరుకుంటున్నారు.

అడ్డుకోలేకపోతున్న జివిఎంసి అధికారులు



కన్యకా పరమేశ్వర ఆలయ నిర్మాణానికి చేపట్టిన పనులు

పవన్ మాటలను వక్రీకరించడం తగదు

ప్రజాశక్తి-సీతమ్మధార : సినిమా ఇండస్ట్రీ అసోసియేషన్ ద్వారా వస్తే సమస్యలను పరిష్కరిస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారని, దీనిని వక్రీకరించి మాట్లాడటం సరికాదని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. సీతంపేటలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తమ నాయకునిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించబోమని, తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సినిమా ఆటోగ్రఫీ మంత్రిగా ఉన్నప్పుడు నువ్వు ఏం అభివృద్ధి చేశావని పేర్ని నానిని నిలదీశారు. మంత్రిగా ఉన్నప్పుడు సినీ పెద్దలందరిని బ్లాక్ మెయిల్ చేసి ఇండస్ట్రీని నిర్వీర్యం చేశారని నానిపై మండిపడ్డారు. తమ నాయకుడు సినిమా ఇండస్ట్రీ నుంచి వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో శివ ప్రసాద్ రెడ్డి, పెతకంశెట్టి శ్యామ్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు నాగమణికి ఉద్యోగం



ఉద్యోగ సిఫార్స్ లెటర్ అందిస్తున్న వాసుపల్లి తదితరులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 41వ వార్డులో పేద మహిళకు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్ అండగా నిలిచారు. బాధితురాలు విస్సారపు నాగమణికి జివిఎంసిలో ఉద్యోగం కల్పిస్తూ ఇచ్చిన సిఫార్స్ లెటర్‌ను మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ద్వారా కోడిగుడ్ల పూర్ణిమ,శ్రీధర్ కార్యాలయంలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ, జగనన్న ప్రభుత్వంలో 2022 జూన్ 11వ తేదీన జ్ఞానాపురం జెఎన్ఎంఆర్ఎం కాలనీలో విద్యుత్ షాక్‌తో విస్సారపు నాగమణి 8 ఏళ్ల కుమారుడు చైతన్య మృతి చెందాడని తెలిపారు. అప్పటినుండి కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్ వారికి అండగా నిలిచారని, ఇపిడిసిఎల్ సంస్థ ద్వారా బాధితులకు రూ.5 లక్షలు అందేలా ఆనాడు కృషిచేశారని తెలిపారు. నాగమణికి జివిఎంసిలో ఉద్యోగం కల్పించడానికి కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ చేసిన కృషిని కొనియాడారు. ప్రమాదవశాత్తు జరిగిన విపత్తుల్లో బాధితులకు అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం వైసిపి మాత్రమే అన్నారు. చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు అమలు కాని హామీలు ఇచ్చి మరోసారి తన దుర్బుద్ధిని ప్రదర్శించుకున్నారని విమర్శించారు. కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ,శ్రీధర్ మాట్లాడుతూ, ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వాసుపల్లి గణేష్ కుమార్ సహకారంతో పేదలకు సంక్షేమంతో పాటు వార్డులో సుమారు రూ.11 కోట్ల పైగా అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వార్డులో అవినీతి తాండవిస్తోందని ఆరోపించారు. పేదలు ఇళ్ల కట్టుకున్నా, వారికి ప్రభుత్వ పనులు జరగాలన్నా స్థానిక నేతలు లంచాలు లేనిదే పనిచేయడం లేదన్నారు. దళారి వ్యవస్థను నమ్మొద్దని ప్రజలకు సూచించారు. వార్డులో డ్రైనేజీ, రోడ్లు, పలు అభివృద్ధి పనులు జరగాల్సి ఉందని తెలిపారు. తమ వార్డుకు జివిఎంసి అదనంగా నిధులు కేటాయించాలని కోరారు.

గౌరీ డిగ్రీ, పీజీ కళాశాలలో నేడు మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఆధ్వర్యాన సోమవారం శ్రీ గౌరీ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ విశాఖపట్నం జిల్లా అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాలో 16 బహుళజాతి కంపెనీలు పాల్గొంటాయని వివరించారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఉద్యోగ మేళా ప్రారంభం అవుతుందని వివరించారు. సుమారు 1500కిపైగా ఉద్యోగ అవకాశాలతో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళాకు సంబంధించి మరిన్ని వివరాలకు 9948768778, 9959377669 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఎం.ఫార్మసీ, బి.ఫార్మసీ, డి.ఫార్మసీ, ఏదైనా డిప్లొమో చదివిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు Naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని జాబ్ మేళాకు అడ్మిట్ కార్డుతో హాజరుకావాలని పేర్కొన్నారు. అదే రోజున స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా ఉందని ఆధార్ నెంబరు, ఆధార్ లింక్డ్ మొబైల్ నెంబర్‌తో హాజరుకావాలని పేర్కొన్నారు.

అలరించిన సంగీత విభావరి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎన్‌టిఆర్ సినీ వజ్రోత్సవాలలో భాగంగా స్వరమాధుర్యం వ్యవస్థాపకులు ఎంవిఆర్.నాగేశ్వరరావు ఆధ్వర్యాన నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో కార్యక్రమాన్ని ఎన్‌టిఆర్ వేషధారణలో ధవళ రుద్రప్రసాద్, కళా ప్రముఖులు భయ్యా శ్రీనివాస్, ఎంవి.రాజశేఖర్, సన్‌మూర్తి, అరుణ్‌కుమార్ ప్రారంభించారు. సినీ, రాజకీయ రంగానికి, తెలుగు భాష ఔన్నత్యానికి ఎన్‌టిఆర్ చేసిన సేవలను వక్తలు కొనియాడారు. ఎంవిఆర్.నాగేశ్వరరావు, భూపతి, రామనరసింహం, కృష్ణంరాజు, రామారావు, శ్రీనివాసరావు, పేమ్మరాజు, గాయని మణులు భాగ్యలక్ష్మి, ఉష, కళ్యాణి, అంబిక కలిసి ఎన్‌టిఆర్ నటించిన వివిధ తెలుగు చలనచిత్రాలలోని గీతాలను మధురంగా ఆలపించారు. రూపవాణి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. సోమేష్ బృందం సంగీత వాయిద్య సహకారం అందించారు.

రెటినోబ్లాస్టోమా చికిత్సపై 'వైటాథాన్ రన్'

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల11-17 తేదీల మధ్య జరిగే రెటినో బ్లాస్టోమా అవగాహన వారాన్ని పురస్కరించుకుని విశాఖపట్నంలోని ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్‌విపిఇఐ) ఆధ్వర్యాన రెటినోబ్లాస్టోమా (కంటి కేన్సర్) ముందస్తు గుర్తింపుపై అవగాహన కల్పించడానికి, దాని చికిత్స కోసం నిధులను సేకరించడానికి ఆదివారం ఉదయం బీచ్‌రోడ్‌లో 'వైటాథాన్' రన్ నాలుగో ఎడిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖపట్నంలోని జిఎన్ఆర్ వరలక్ష్మి క్యాంపస్ అడ్జంక్ట్ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ జి.సునీత రెటినోబ్లాస్టోమా లక్షణాల గురించి ప్రజలలో అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని తెలిపారు. రెటినో బ్లాస్టోమా లక్షణాల గురించి ప్రజలకు, ముఖ్యంగా యువ తల్లిదండ్రులకు అవగాహన చాలా ముఖ్యమని పేర్కొన్నారు. పిల్లల కంటిలో తెల్లని ప్రతిబింబం కనిపించిన వెంటనే, కంటి నిపుణుడితో పరీక్షించడం అవసరమన్నారు. ముందస్తు గుర్తింపు, చికిత్స పిల్లల ప్రాణాన్ని, కళ్ళని, కంటి దృష్టిని కాపాడగలదని తెలిపారు. మరో డాక్టర్ వీరేంద్ర సద్వేవ రెటినోబ్లాస్టోమా లక్షణాల గురించిన అవగాహనను పెంచాలని కోరారు. 'మనందరమూ వైటాథాన్లో పాల్గొనడం ద్వారా పొందిన అవగాహనను సన్నిహితులతో పంచుకుంటే, కేసులను ముందస్తుగా గుర్తించి చికిత్స చేయడం ద్వారా కంటి దృష్టినీ, ప్రాణాన్ని కాపాడడంలో పెద్ద మార్పు తీసుకొచ్చే అవకాశం ఉంది అని ఆయన అన్నారు. వైటాథాన్ రన్ ద్వారా సేకరించిన నిధులను ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకు రెటినోబ్లాస్టోమా చికిత్సను ఉచితంగా అందించడానికి మరియు భవిష్యత్ పరిశోధనకు ఉపయోగిస్తారని తెలిపారు. ఈ సంవత్సరం, 450 మందికిపైగా ఔత్సాహిక భాగస్వాములు ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా ఈ కార్యక్రమానికి బలమైన సామూహిక మద్దతును తెలిపారు.

బిసి బాలికల హాస్టల్‌ను ప్రారంభించరా?

- నిర్మించి ఐదేళ్లు దాటినా నేటికీ నిరుపయోగమే
- ఉన్నత విద్యకు దూరమౌతున్న గ్రామీణ పేద విద్యార్థినులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఐదేళ్లకు పైగా నిరుపయోగంగా ఉన్న బాలికల హాస్టల్ భవనం

ప్రజాశక్తి- కె. కోటపాడు: మండల కేంద్రమైన కె. కోటపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించిన ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ బాలికల వసతిగృహాన్ని ఈ ఏడాదైనా వినియోగంలోకి తేవాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తిచేసుకుని ప్రారంభించినా, ఈ హాస్టల్‌ను వినియోగంలోకి తేవడంలోవిఫలమయ్యారు. రానున్న కొత్త విద్యాసంవత్సరంలోనైనా దీన్ని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

బిసి బాలికలకు వసతి గృహం అందుబాటులో లేకపోవడంతో దశాబ్దాలుగా బిసి విద్యార్థినులు ఉన్నత చదువులకు వెళ్లలేక అర్ధాంతరంగా చదువు మానేసే సందర్భాలున్నాయి. దీనిపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఏళ్లతరబడి నేతలు, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకోగా, గత ప్రభుత్వ హయాంలో రూ.1.94 కోట్ల ఆర్ఎంఎస్ఎ నిధులు మంజూరుచేసి, స్థానిక ఉన్నతపాఠశాల ఆవరణలో హాస్టల్ భవనాన్ని నిర్మించారు. దాన్ని అప్పటి డిప్యూటీ ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు 2020 సెప్టెంబర్ 5, ప్రారంభించినప్పటికీ, పలు కారణాలతో వినియోగంలోకి తేకుండా నిరుపయోగంగా ఉంచారు. దీంతో ఈ హాస్టల్ భవనంలోనివిద్యుత్తు ఉపకరణాలు, ఫ్యాన్లు, కుళాయిలు ఇలా విలువైన సామగ్రి చోరీకి గురైంది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత . ప్రస్తుత ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దీనిపై దృష్టి పెట్టి, బిసి హాస్టల్ భవనానికి మరమ్మతులు, సౌకర్యాలను కల్పించి, ప్రారంభానికి సిద్ధం చేశారు. 6 వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదివే బిసి బాలికలకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఈ హాస్టల్‌ను ఎప్పటికీ ప్రారంభించకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి చదివే స్థోమత లేని విద్యార్థినులతోపాటు వేరే గ్రామానికి తమ పిల్లలను పంపడం ఇష్టం లేని అనేకమంది బాలికలు చదువులు అర్ధాంతరంగా ఆగిపోయాయి.

ఈ హాస్టల్ భవనానికి సమీపంలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాల కూడా ఉండడంతో ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు మండలంలోని పలు గ్రామాల పేద బిసి విద్యార్థినులు ఎటువంటి ఆటంకం లేకుండా చదువు కొనసాగించడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఈనేపథ్యంలో వచ్చేనెలలో ప్రారంభం కానున్న కొత్త విద్యా సంవత్సరంలోనైనా దీన్ని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు. దీనిపై ఎంఇఒ సత్యనారాయణను వివరణ కోరగా, బిసి హాస్టల్ భవనం ప్రారంభంపై నేటి వరకు ప్రభుత్వం నుండి ఎటువంటి ఆదేశాలు రాలేదన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలొచ్చిన వెంటనే ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

సమ్మె విరమించిన సిహెచ్‌ఒలు



విధులకు సిద్ధమౌతున్న సిహెచ్‌ఒలు

ప్రజాశక్తి- అనకాపల్లి : రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ఇచ్చిన హామీ మేరకు సమ్మె విరమిస్తున్నట్లు ఎంపి ఎంసిఎ, సిహెచ్‌ఒల యూనియన్ నేతలు ప్రకటించారు.తమ సమస్యల పరిష్కారానికి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ రాష్ట్ర వ్యాప్తంగా 27 రోజులుగా సమ్మె చేసిన విషయం తెలిసిందే. అయితే రాష్ట్రమంత్రిని కలిసి యూనియన్ నాయకులు సమస్యలపై చర్చించిన మీదట మంత్రి సానుకూలంగా స్పందించి, పలు సమస్యల పరిష్కారానికి హామీనిచ్చిన నేపథ్యంలో సమ్మె విరమిస్తున్నట్లు తెలిపారు. మంత్రి హామీతో ఎంపి ఎంసిఎ రాష్ట్ర నాయకులు నిరంజన్, సందీప్, వినోద్ పిలుపు మేరకు విధులకు హాజరవుతున్నట్లు వెల్లడించారు. సమ్మె కాలంలో తమకు పర్మిషన్స్ ఇచ్చిన కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారికి, పోలీస్ అధికారులకు, వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బందికి, మెడికల్ ఆఫీసర్లకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఈ సమ్మెలో ఎలా ముందుకు వెళ్ళాలనే ప్రతి అడుగులోనూ తమకు తోడుగా ఉన్న ఎపి ఎన్‌జిఒ సంఘం, పిహెచ్‌సి డాక్టర్ల అసోసియేషన్, పిహెచ్‌అండ్ ఎంఇయు, ఎపి ఎన్ఎస్ఎస్ సంఘాల నాయకులు, నర్సింగ్ సంఘాలు, స్టూడెంట్ ఫెడరేషన్, ప్రజా సంఘాల నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

జనసేనలో పలువురి చేరిక



పంచకర్ల సమక్షంలో జనసేనలో చేరిన వైసిపి నేతలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట :మండలంలో వైసిపికి షాక్ తగిలింది. ఆర్ భీమవరం, చిన భీమవరం, రాజాం గ్రామాల నుండి పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు జనసేనలో చేరారు. ఆదివారం వడ్డాదిలో జనసేన జిల్లా అధ్యక్షుడుచ పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పివిఎస్ఎన్ రాజు వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు..ఆర్ భీమవరం నుంచి కవల సతీష్, పదో వార్డు సభ్యుడు రాజాన చినఅప్పలనాయుడు, వైస్ ప్రెసిడెంట్ చిలుకు రాజు, ఎస్ఎంసి చైర్మన్ మందపాక మంగ శ్రీను, వి..అప్పలనాయుడు తదితరులు జనసేనలో చేరారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంపై నమ్మకంతోనే తాము జనసేనలో చేరినట్లు తెలిపారు. స్థానిక ఉపసర్పంచ్ దాడి సూర్య నాగేశ్వరరావు, సీనియర్ నేత అడపా నరసింహమూర్తి, టౌన్ అధ్యక్షుడు దొండా సాయి, కెజిబివి ఎస్ఎంసి చైర్మన్ యడ్ల రామ్మూర్తి పాల్గొన్నారు.

యోగాంధ్ర పేరుతో మభ్యపెట్టొద్దు

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి -మునగపాక: యోగాంధ్ర పేరు చెప్పి రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టడం సరికాదని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి ఆరోపించారు. ఆదివారం మండలంలోని తిమ్మరాజుపేట డావెన్సీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో రెండవ రోజు మహిళా చైతన్య శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తుంగలో తొక్కి, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు యోగాంధ్ర వంటి కార్యక్రమాలు చేయడం సిగ్గుచేటన్నారు. కడపలో మూడేళ్ల చిన్నారిపై పాశవికంగా అత్యాచారం, హత్య జరిగితే ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి అనిత స్పందించకపోవడం విచారకరమన్నారు. రాష్ట్రంలో మహిళలు, వృద్ధులు, చిన్నారులపై తరచూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం దుర్మార్గమని ఆవేదన వెలిబుచ్చారు. ఇటువంటి వాటిపై ప్రజల్లో అవగాహనకు ప్రభుత్వం నెలరోజుల ప్రచారం ఎందుకు చేయకూడదని ప్రశ్నించారు. మహిళల రక్షణ, ఆరోగ్యం, ఉద్యోగం లేదా ఉపాధి, రాజ్యాంగంలో పొందుపరచిన సమానత్వాన్ని సాధించేందుకు అడుగులు కదపాలని రాష్ట్ర ప్రభుత్వానికి హితవు పలికారు.

అనంతరం 'మహిళా సంఘం నిర్మాణం'పై ప్రభావతి, "సరళీకరణ విధానం, మహిళపై ప్రభావం" అనే అంశంపై బి రాంభూపాల్ బోధించారు. ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ గోల్డ్ మెడలిస్ట్ ఎ.సత్తిబాబు మహిళా సమస్యలపై ఆలపించిన గీతాలు అలరించాయి. ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు వై సత్యవతి ప్రిన్సిపల్‌గా వ్యవహరించిన శిక్షణ తరగతులలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి మాణిక్యం, ప్రధాన కార్యదర్శి డిడి వరలక్ష్మి, ఆర్.లక్ష్మి, వాణి, జి సుభాషిణి, సిహెచ్ మంగతాయారు, సత్యవతి, గౌరీ, సూర్య ప్రభ పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ సమస్యల నమోదుకు 1100 టోల్‌ఫ్రీ నెంబరు

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ఫిర్యాదులను నేరుగా గానీ, టోల్ ఫ్రీ నెంబర్ 1100 కు ఫోన్ చేసి నమోదు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితి, సమాచారాన్ని కూడా టోల్ ఫ్రీ నెంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. కాగా ప్రతిసోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనూ, అలాగే అనకాపల్లి, నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయాలు, అన్ని మండలాల్లోనూ యధావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలు కొనసాగుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు.

యోగాంధ్రలో మాస్టర్ ట్రైనర్లు కీలకం



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి- అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం విజయవంతంలో మాస్టర్ ట్రైనర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టరు విజయకృష్ణన్ తెలిపారు. ఆదివారం స్థానిక రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న రెండురోజుల యోగా మాస్టర్ ట్రైనర్లు శిక్షణను పరిశీలించారు. ఈసందర్భంగా యోగా మాస్టర్ ట్రైనర్లను ఉద్దేశించి జిల్లా కలెక్టరు మాట్లాడుతూ మండల స్థాయిలో శిక్షణకు మాస్టరు ట్రైనర్లకు రెండు రోజుల శిక్షణ నిర్వహిస్తున్నామని, శిబిరంలో చక్కగా యోగా శిక్షణ తీసుకొని, తర్వాత మండలాలలో ఒక్కొక్కరు యాభై మందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. యోగాంధ్ర విజయంలో మాస్టర్ ట్రైనర్లు కీలక బాధ్యత తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ యోగాంధ్ర యాప్‌లో నమోదు కావాలని, అలాగే ప్రజలను పెద్దఎత్తున యాప్‌లో రిజిస్ట్రేషను చేయించి, వారి భాగస్వామ్యం పెంచేలా అవగాహన, ప్రచారం కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరు యోగా చేసేలా ప్రోత్సహించాలని, యోగాతో ఆరోగ్యం వస్తుందని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలన్నారు. జిల్లా టూరిజం అధికారి కె. మనోరమ, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె. లావణ్య, మాస్టరు ట్రైనర్లు పాల్గొన్నారు.

శాప్ చైర్మన్ రవికి జన్మదిన శుభాకాంక్షలు



రవికి శుభాకాంక్షలు చెబుతున్న రాజు

ప్రజాశక్తి-సబ్బవరం : ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ (శాఫ్) చైర్మన్ అనిమిని రవినాయుడుకు అనకాపల్లి జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు పిబివిఎస్ఎస్.రాజు జన్మదినశుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం తిరుపతిలో రవినాయుడును కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. సబ్బవరం మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రతిభకు పూర్వ విద్యార్థుల సత్కారం



జ్ఞాపికలతో ప్రతిభ చూపిన విద్యార్థులు

ప్రజాశక్తి- మునగపాక: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి పరీక్ష ఫలితాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను 1995- 96 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఘనంగా సత్కరించారు.టెన్త్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మిగిలిన వారికి జ్ఞాపికలను బహూకరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, విద్యార్థులంతా బాగా చదివి గ్రామానికి, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్ర రామారావు, పూర్వ విద్యార్థులు ఆనందబాబు జోగారావు, గిరీష్ కుమార్, జగ్గ అప్పలనాయుడు, బాపు నాయుడు, హరికుమారి, వెంకటేశ్వరి, పద్మ పాల్గొన్నారు.

25 వార్డులకు టిడిపి ఇన్‌ఛార్జిలు

ప్రజాశక్తి - యలమంచిలి : ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని 25 వార్డులకూ టిడిపి ఇన్‌చార్జిలను నియమిస్తూ ఆ పార్టీ పట్టణ కమిటీ ఆదివారం ప్రకటన విడుదల చేసింది.ఒకటోవార్డు ఇన్‌ఛార్జిగా యల్లపు శ్రీనివాస్, రెండవ వార్డుకు పండూరి శ్రీనివాసరావు, 3వ వార్డుకు పిల్లా గంగాధర్, 4వ వార్డుకు : డి. ఆదిలక్ష్మి, 5వ వార్డుకు ఆడారి సత్యనారాయణ, 6వ వార్డుకు ఎవిఎస్ రావు, 7వ వార్డుకు డివిఎస్ బాబు, 8వ వార్డుకు బి విమల, 9వ వార్డుకు కెవిఎస్.ప్రకాష్, 10వ వార్డుకు కెవిఎస్.రావు, 11వ వార్డుకు కెవి.దేవి, 12వ వార్డుకు యువిఎస్ నారాయణ, 13వ వార్డుకు కొరెడ్ల వెంకట సత్యనారాయణ, 14వ వార్డుకు జి.రాము, 15వ వార్డుకు దాడి రమేష్, 16వ వార్డుకు యు.దేముళ్ళ, 17వ వార్డుకు ఎస్ శ్రీనివాసరావు, 18వ వార్డుకు సూరకాసుల వెంకటరమణ, 19వ వార్డుకు ఎస్ తులసీరామ్, 20వ వార్డుకు బిఎస్.రావు, 21వ వార్డుకు ఎంఎస్.రావు, 22వ వార్డుకు జి రత్నాజీ, 23వ వార్డుకు ఎం రాంబాబు, 24వ వార్డుకు జివిబి. రావు, 25వ వార్డుకు పి.ఆదిబాబులను నియమించారు.

టిడిపిని వీడే ప్రసక్తే లేదు..

ప్రజాశక్తి - యలమంచిలి : పార్టీ మారుతున్నారన్న వదంతుల్ని యలమంచిలి రూరల్ తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు ఇత్తంశెట్టి రాజు ఖండించారు. ఆదివారం జిల్లా ఉపాధ్యక్షులు కొలకులూరి విజయబాబుతో కలిసి ప్రకటన విడుదల చేశారు. ఇటీవల పార్టీ సంస్థాగత ఎన్నికల్లో పార్టీ అధిష్టానం నిర్ణయం, అందరి సమిష్టి అభిప్రాయం మేరకే కొత్త కార్యవర్గం ఏర్పడిందన్నారు. ఇందులో తన పదవి మారినంత మాత్రాన, పార్టీని వీడే మనస్తత్వం కాదని వివరించారు.కష్టించి పనిచేసే కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీలో మంచి గుర్తింపు ఉంటుందని విశ్వాసాన్ని ప్రకటించారు.

ఎండియు వ్యవస్థను కొనసాగించాలి

ప్రజాశక్తి -మునగపాక: ఎండియు వ్యవస్థను కొనసాగించాలని ఎఐటియుసి నాయకులు కోన లక్ష్మణ ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. వైసిపి పాలనలో ఇంటింటికీ రేషన్ పంపిణీకి అమలుచేసిన ఎండియు విధానాన్ని రద్దు చేయడం దుర్మార్గమన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలనే ఉద్దేశం ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉంటే, కేరళ తరహాలో పేదలకు రేషన్ దుకాణాల ద్వారా 16 రకాల నిత్యావసరాలను పంపిణీ చేయాలన్నారు. గత ప్రభుత్వంలో 2027 వరకు ఎండియు వాహనాలకు ఒప్పందం ఉన్నప్పటికీ, అప్పట్లో ఏర్పాటు చేశారన్న ఒక్క కారణాన్ని మినహాయిస్తే ఈ వ్యవస్థను రద్దుచేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఎండియు వాహనాల ఇఎంఐలు నేటికీ పూర్తికాని స్థితిలో ఈ విధానాన్ని రద్దుచేసి, వాటి నిర్వాహకులు, హెల్పర్లను రోడ్డున పడేయొద్దని కోరారు.

వైసిపి బలోపేతానికి కమిటీల ఏర్పాటు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజు

ప్రజాశక్తి - సబ్బవరం : వైసిపి సంస్థాగత బలోపేతానికి బూత్, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు పెందుర్తి నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు.ఆదివారం ఇరువాడ దరి మండల వైసిపి కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో అన్నిస్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేసి సమస్యలపై ప్రజలకు అండగా ఉండడంతోపాటు పార్టీ బలోపేతం చేస్తామన్నారు. ఇచ్చిన హామీల అమలులో వైఫల్యంతో ఏడాదిలోపే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత కనిపిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు అండగా ఉండి, వారి సమస్యలపై పోరాటం చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. నియోజకవర్గ నేత గండి రవికుమార్ ఎంపిపి బోకం సూర్యకుమారి రాము నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కర్రి బాబు, నాయకులు కోటాన రాము, వనం అచ్చంనాయుడు, వద్దాది అప్పలరాజు, మోపాడ అప్పారావు, దెడ్డం ప్రసాదరావు, గొర్లి రాజేష్, బొడ్డేటి మహాలక్ష్మి నాయుడు, దనిమిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధ్వాన రహదారితో అవస్థలు

- నిండా గోతులమయమైన దేవరాపల్లి, వాలాబు రోడ్డు
- రాకపోకలకు జనం, వాహనదారుల ఇబ్బందులు
- గిరిజనం మొర పట్టించుకోని అధికారులు, నేతలు



మట్టిరోడ్డు కన్నా అధ్వానంగా వాలాబు తారురోడ్డు

ప్రజాశక్తి- దేవరాపల్లి : దేవరాపల్లి నుంచి వాలాబు వెళ్లే తారురోడ్డు నిండా భారీ గోతులతో అధ్వానంగా దర్శనమిస్తుంది. రోడ్డు నిండా గుంతలు పడడంతో వాలాబు పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్లుగా పునర్నిర్మాణం, నిర్వహణ లేకపోవడంతో ఈ రోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. అంతంతమాత్రంగా ఉన్న ఈ రోడ్డులో వాలాబు పంచాయతీ శివారు గ్రామాలకు సిసి రోడ్డు నిర్మాణానికి అధికలోడుతో లారీల్లో మెటీరియల్ తరలించడంతో వాటి తాకిడిని తట్టుకోలేక రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దేవరాపల్లి నుంచి సుమారు 10 కిలోమీటర్ల మేర ఉన్న తారురోడ్డంతా నిండా అడుగడుగునా భారీ గుంతలు ఏర్పడడంతోపాటు పలుచోట్ల తారురోడ్డు పూర్తిగా ఆనవాలు కోల్పోయినంతగా శిథిలమవ్వడంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలపై సైతం రాకపోకలు సాగించేందుకు ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దేవరాపల్లి, వాలాబు రోడ్డులో ఏర్పడ్డ గుంతల్లో నీరు చేరడంతో అవి నీటి కుంటలను తలపిస్తున్నాయి. ఎక్కడ ఎంతలోతు గొయ్యి, ఏ పరిస్థితుల్లో ఉందో తెలియక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో ప్రయాణించే ఆటోలు, ఇతర వాహనాలు ఊయలూగుతున్నట్లు ముదుకు వెళ్లాల్సిన స్థితిలో అందులో ఉన్న వారి ఒళ్లు హూనమవ్వడంతో పాటు, వాహనాలు సైతం మరమ్మతులకు గురై షెడ్లకు చేరుకుంటున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. గడచిన సంక్రాంతి నాటికి గుంతలున్న రోడ్డు రాష్ట్రంలో లేకుండా చేస్తామని ప్రకటించిన కూటమి పాలకులకు దేవరాపల్లి, వాలాబు రోడ్డు దుస్థితి కనిపించడం లేదాయని స్థానికుల ఆవేదన చెందుతున్నారు. నిత్యం ప్రమాదాలకు నెలవుగామారిన ఈ రోడ్డు దుస్థితిపై ఇప్పటికైనా స్పందించి తక్షణ మరమ్మతులు, తర్వాత శాశ్వత ప్రాతిపదికన పునర్నిర్మాణ చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.



రహదారిలో పూర్తిగా చెదిరిపోయిన తారు పొర



రోడ్డు గుంతల్లో చేరిన వర్షపునీరు

ఉదర వ్యాధుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి- అనకాపల్లి : ఉదర సంబంధిత వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి, తగు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు వాటి నివారణపై అవగాహన కలిగి ఉండాలని ఆంధ్ర మెడికల్ కాలేజీ జనరల్ సర్జరీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వివిపి.మహీధర్ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌టిఆర్ మార్కెట్ యార్డ్‌లో అనకాపల్లి వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం సందర్భంగా 'ఉదర సంబంధిత వ్యాధులు. నివారణోపాలు' అంశంపై వాకర్స్‌కు అవగాహన కల్పించారు. పొట్టలో మూత్రాశయంలో రాళ్ల ఏర్పడితే అవి మూత్ర ద్వారానికి అడ్డుపడి మూత్రం సరిగ్గా రాదన్నారు. చిరుతిళ్లు తినడం వలన జీర్ణశక్తి సన్నగిల్లి కడుపునొప్పి వస్తుందని, అలాగే నీరు సరిపడా తాగకపోతే మూత్రపిండాల సమస్య ఉత్పన్నమై, శరీర సమతుల్యత కోల్పోతుందని సూచించారు. మలవిసర్జన సరిగ్గా కాకపోతే దానివల్ల అనేక ఎక్కువ సమస్యలు వస్తాయన్నారు. ఉదర సమస్యలు రాకుండా ముందుగా తగు జాగ్రత్తలు తీసుకోవడం తోపాటు, వచ్చాక ఎటువంటి నిర్లక్ష్యం చేయకుండా తగు వైద్యసేవలను పొందాలని సూచించారు.



మాట్లాడుతున్న డాక్టర్ మహీధర్

ఈ సందర్భంగా డాక్టర్ మహీధర్‌ను వాకర్స్ క్లబ్ అధ్యక్షులు రాపేటి నారాయణరావు, కార్యదర్శి వై శివ, కోశాధికారి కెవివి సత్యనారాయణ, సిహెచ్ నరసింగరావు, ఆడారి మల్లికార్జునరావు, భీశెట్టి రామకృష్ణ, నల్లాల దేవుళ్ళు, బుద్ద కాశీ, గౌరీపతి, కె పూర్ణచంద్రరావు డిఎస్ఎస్ మాణిక్యాలరావు, డాక్టర్ కె వీరభద్రరావు తదితరులు దుశ్శాలువా, మెమంటోలతో సత్కరించారు. ఈ సందర్భంగా 45 మంది వాకర్స్ సందేహాలను డాక్టర్ మహీధర్ నివృత్తి చేశారు.

రాజకీయ కుట్రతోనే ఎండియులు రద్దు

చంద్రబాబువి డైవర్షన్ పాలిటిక్స్ : వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె రాజు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీలో జగన్మోహన్‌రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందనే రాజకీయ కుట్ర కోణంలోనే ఎండియు వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందని వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షుడు కెకె.రాజు ఆరోపించారు. ఎండియులను రద్దుచేసి, పాత విధానంలోనే రేషన్ పంపిణీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్, ఎల్‌ఐసి బిల్డింగ్, అంబేద్కర్ విగ్రహం మీదగా జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ఎండియు డ్రైవర్స్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వైసిపి జిల్లా అధ్యక్షుడు కెకె.రాజు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, వైసిపి తూర్పు ఇన్‌ఛార్జి మొల్లి అప్పారావు తదితరులు పొల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కెకె రాజు మాట్లాడుతూ,రాష్ట్రంలో రేషన్ డిపోల వద్ద గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి రేషన్ సరుకులు తెచ్చుకునేందుకు పేదలు పడుతున్న ఇబ్బందులను గమనించి నాటి ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఇంటివద్దకే రేషన్ అందించాలనే ఉద్దేశంతో ఈ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. దీని ద్వారా రేషన్‌కార్డుదారులకు ప్రయోజనంతోపాటు, 20 వేల కుటుంబాలకు ఉపాధి కల్పించారన్నారు. ఈ వ్యవస్థ ద్వారా జగన్మోహనరెడ్డిపేరు ప్రజల మదిలో నిలిచిపోతుందనే అక్కసుతో డైవర్షన్ పాలిటిక్స్‌లో ప్రసిద్ధి చెందిన చంద్రబాబు ఈ విధానాన్ని రద్దు చేశారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో పడాల రమణ, ఎండియు డ్రైవర్స్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు ఎన్.సతీష్, ఆది బాబు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న కెకె.రాజు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

'గ్లాన్స్ ఎఐ' ఇ-కామర్స్ యాప్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ప్రపంచ వాణిజ్యం ఎఐ ఆవిష్కరణలకు కీలకమైన సమయంలో, గూగుల్ మద్దతు ఉన్న ప్రముఖ వినియోగదారు సాంకేతిక సంస్థ గ్లాన్స్, తమ అధునాతన ఎఐ నమూనాల ద్వారా శక్తివంతమైన ఎఐ నేటివ్ వాణిజ్య వేదిక గ్లాన్స్ ఎఐ యాప్‌ను విశాఖలో ఆవిష్కరించింది. ఈ సందర్భంగా ఏ సంస్థ ప్రతినిధి నవీన్ తివారి మాట్లాడుతూ గ్లాన్స్ ఎఐ, ఆన్‌లైన్ షాపింగ్ విధానాన్ని మారుస్తుందని అన్నారు. ఈ యాప్ నేడు ప్రపంచవ్యాప్తంగా గూగుల్ ప్లే స్టోర్ , యాపిల్ యాప్ స్టోర్ రెండింటిలోనూ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఆండ్రాయిడ్ హ్యాండ్‌సెట్ తయారీదారులు, ,టెలికాం ఆపరేటర్లకు త్వరలోనే అందుబాటులోకి వస్తుందన్నారు. బహుళ ఉత్పత్తులను ప్రదర్శించే సాధారణ ఇ-కామర్స్ స్టోర్‌ల మాదిరిగా కాకుండా, గ్లాన్స్ ఎఐ వినియోగదారులను వారి ఎఐ - క్యూరేటెడ్ శైలీకృత రూపాలను కనుగొనడానికి ఉపయోగపడుతుందన్నారు

జల్ జీవన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని చౌడపల్లి గ్రామంలో ఆదివారం జల్ జీవన్‌మిషన్ పనులను ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇంటింటికీ కుళాయిల ద్వారా రక్షితతాగునీరు అందించాలనే సంకల్పంతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా జల్‌జీవన్‌మిషన్ పనులు చేపడుతున్నాయన్నారు. ఈసందర్భంగా గ్రామస్తులకు తడి పొడి చెత్త సేకరణకు డస్ట్ బిన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గండిబోయిన భాను వెంకట్, జనసేనమండల శాఖ అధ్యక్షులు బి రాందాస్, ఒడిసెల నాయుడు, ఇల్లా లోకనాథం పాల్గొన్నారు.

పంట కాలువల్లో పూడికతీత

ప్రజాశక్తి - మునగపాక: రానున్న ఖరీఫ్ సీజన్‌లోఆయకట్టు భూములకు సాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు స్థానిక కృష్ణంరాజు కాలువలో పూడికతీత పనులు చేపడుతున్నట్లు జనసేన పార్టీ మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం అన్నారు. ఆదివారం జెసిబితో పూడికతీత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండల కేంద్రం మునగపాక గ్రామ పెద్దమదుము నుంచి తిమ్మరాజుపేట వరకు కృష్ణంరాజు కాలువలో అడ్డంకిగా ఉన్న పూడికలను తొలగించడం ద్వారా రానున్న వర్షాకాలంలో పంట భూములకు సాఫీగా నీటిపారుదలకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు పరశురాం తెలిపారు. కార్యక్రమంలో కృష్ణంరాజు ఛానల్ నీటిసంఘం అధ్యక్షులు పెంటకోట రాము, వైస్ ప్రెసిడెంట్ పెంటకోట శ్రీరామమూర్తి, డైరెక్టర్ నర్సింగరావు, సూరిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఆడేది ఎలా...


ఆట స్థలాలు ఇలా..

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇటీవల 4.50 లక్షలతో నిర్మాణం చేపట్టిన వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో, ఆట స్థలాలు అనాలోచితంగా నిర్మాణం చేపట్టడంతో క్రీడాకారులు అవస్థలు పడుతున్నారు. చదువుతోపాటు క్రీడలలో కూడా తర్ఫీదునిచ్చి మంచి క్రీడాకారులను తయారు చేయాలని ఉద్దేశంతో నిర్మించిన వివిధ ఆట స్థలాల సముదాయం

సక్రమంగా నిర్మాణం చేయక పోవడంతో విద్యార్థులు , క్రీడా అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత పాఠశాలలో నిర్మాణం చేపట్టిన వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో కోర్టుల నిర్మాణాలు భూమి లెవెల్ కంటే చుట్టూ దాదాపు అడుగున్నర ఎత్తు వరకు గోడల నిర్మించి వాటిలో కోర్టులు ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందని, ఈ ఆట స్థలాలలో ఆటలు అడినట్లయితే క్రీడాకారులకు గాయాలు అయ్యే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు,

ఇక్కడ నిర్మాణం చేపట్టిన వాలీబాల్ కోర్టు, కబడ్డీ కోర్టు, ఖో ఖో,కోర్టుకు సరిపడే స్థలంలోనే సుమారు అడుగు ఎత్తులో చుట్టూ గోడలు ఏర్పాటు చేయడం, ఆట సమయంలో నిర్మించిన కోర్టు బైటకు వచ్చి కొన్ని సందర్భాలలో ఆట ఆడాల్సిన పరిస్థితి వస్తుంది. ఈ సమయంలో గాయాలు పాలయ్యే అవకాశం ఉంది. ఉదాహరణకు వాలీబాల్ ఆడాలంటే వచ్చిన బాల్‌ను మూడు లిఫ్టులలో అటువైపు పంపించాల్సి వస్తుంది. ఈ సమయంలో బంతి కోర్టు వెలుపలకు వెళ్లిన దాన్ని తిరిగి అటువైపు పంపించేందుకు ప్రయత్నిస్తారు. ఈ క్రమంలో క్రీడాకారులకు గాయాలు అయ్యే అవకాశం ఉంది.

అవస్థలు పడుతున్న క్రీడాకారులు



అనారోచితంగా నిర్మించిన క్రీడా కోర్టు

అదేవిధంగా ఖో ఖో, కబడ్డీ ఆటల స్థలాల పరిస్థితి కూడా అంతే. ఈ విధంగా అనాలోచింతంగా క్రీడా కోర్టులు నిర్మాణం చేపట్టడంపై పలువురు కోచ్‌లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

క్రీడాకారులకు ఇబ్బందులు

వాలీబాల్ కోర్టు 9ఐ18 మీటర్లు ఉండాల్సి ఉండగా అదే కొలతలతో నిర్మించారు. భూమి లెవెల్ కంటే అడుగున్నర ఎత్తులో ఉండడంతో క్రీడాకారులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఇదే తీరుగా కబడ్డీ, ఖోఖో, కోర్టుల నిర్మాణం చేపట్టారు. విద్యార్థులు ఈ కోర్టులో ఆటలు ఆడాలంటే ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. లేకపోతే గాయాలు పాలవుతారు

షేక్ మస్తాన్,
ఫిజికల్ డైరెక్టర్



ఆడేందుకు అవస్థలు

ఇక్కడ నిర్మించిన వాలీబాల్, కబాడీ, ఖోఖో కోర్టులు, విద్యార్థులు ఆడుకునేందుకు ఇబ్బందికరంగానే ఉంది. భూమి లెవెల్ కంటే ఎత్తుగా నిర్మించడంతో ఆడుకునేందుకు ఎవరు మక్కువ చూపించ లేదు. ఆట సమయంలో అదుపుతప్పితే గాయాలు పాలవుతామని ఆందోళన చెందుతున్నాం..

వంకర రవి
క్రీడాకారుడు





మహిళలను పరీక్షిస్తున్న వైద్యులు

మహిళలకు కేన్సర్ పరీక్షలు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని అమలాపురం పంచాయతీ పాటిమీద గ్రామంలో వేంపాడు వికాస తరంగణి ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. మహిళా ఆరోగ్య వికాస్ కార్యక్రమంలో భాగంగా వైజాగ్ వికాస తరంగణి సభ్యులు కుసుమ కుమారి, కృష్ణ వేణి, ఉమా, డాక్టర్ మాధవీలత సహాయ సహకారాలతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో మహిళలకు బ్రెస్ట్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ సంబంధిత పరీక్షలు చేసారు. సమస్య ఉన్న వారిని గుర్తించి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ మాధవిలత సూచనల మేరకు క్యాన్సర్ సంబంధించిన వ్యాధి తీవ్రతరంగా ఉన్న వారిని గుర్తించి, తదుపరి పరీక్షలు నిమిత్తం విశాఖపట్నం ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట వికాస తరంగిణి శాఖ సభ్యులు చిక్కాల శ్రీనివాస్, నక్కపల్లి వికాస తరంగిణి శాఖ సభ్యులు సుభాష్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జగతా శ్రీనివాస్, ధనిశెట్టి తిరుమలేశ్వరావు (బుజ్జి) పాల్గొన్నారు.



రక్తదాతకు జ్యూస్ ఇస్తున్న డిఎస్‌పి

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:ఎన్టీఆర్ మిని స్టేడియంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రాంతీయ హాస్పటల్ నెట్ బ్యాంకింగ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరాన్ని డిఎస్పి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తదానం ఎంతోమంది ప్రాణాలను నిలబెడుతుందని, ఇటువంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. 50 సంవత్సరాలు పైబడిన వారు రక్తదానం చేయడానికి ముందుకు వచ్చి యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు. అనంతరం వాకర్స్ క్లబ్ కి బ్లడ్ డొనేషన్ క్యాంప్ సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ, పూర్వపు అధ్యక్షులు అడిగేళ్ల వరహాల నాయుడు, ఉపాధ్యక్షులు కుప్పిలి శ్రీనివాసరావు, ఎంవి రంగారావు, సంయుక్త కార్యదర్శి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి శంకర్ రెడ్డి, ప్రాంతీయ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ చైర్మన్, సభ్యులు

మోదకొండమ్మ జాతర పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-మాడుగుల:మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి జాతర మహొత్సవం కార్యక్రమాల పోస్టర్‌ను ఆదివారం ఉదయం ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో నూతన కమిటీ, పాత కమిటీ సభ్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, జూన్ మూడో తేదీన జరిగే అమ్మవారి జాతరకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. ఎక్కడ ఎటువంటి సమస్య తలెత్తకుండా కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలని కోరారు. అమ్మవారి జాతరకు సంబంధించి ఏర్పాటు చేసిన పలు సాంస్కతిక స్టేజీల వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తరత్తకుండా ఏ విధమైన చర్యలు తీసుకోవాలన్న దానిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, దేవరపల్లి శ్రీను, భీమర శెట్టి పైడియనాయుడు, పాత, కొత్త ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నెలకు 8 రోజులు నియోజకవర్గాల్లో పర్యటిస్తా

- జనసేన రూరల్ అధ్యక్షులు, ఎమ్మెల్యే పంచకర్ల

ప్రజాశక్తి-మాడుగుల:నెలకు 8 రోజులు నియోజక వర్గాలలో పర్యటిస్తానని జనసేన విశాఖ జిల్లా ఉమ్మడి రూరల్ అధ్యక్షుడు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అన్నారు. మండలంలోని కింతలి వల్లాపురం గ్రామంలో జనసేన పార్టీలో చేరికలు సందర్భంగా ఆశోక్, గజపతి నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ముందుగా ఘాటీరోడ్డు నుంచి కింతలి వల్లాపురం వరకు బైక్ ర్యాలీగా జనసైనికులు సభకు తరలివచ్చారు. నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ రాయపురెడ్డి కృష్ణ మాట్లాడుతూ, నియోజకవర్గంలో చీడికాడ, కె కోటపాడు మండలాల్లో మండల అధ్యక్షులను త్వరగతిన ఏర్పాటు చేయాలన్నారు. రమేష్ బాబు మాట్లాడుతూ, మాడుగుల నియోజకవర్గంలో ఉన్న సమస్యలపై ఎమ్మెల్యే బండారు సత్యనారాయణతో మాట్లాడి పదవులు, అభివద్ధి, సంక్షేమ వంటి విదివిధానాలను ఆలోచించి క్షేత్ర స్థాయిలో అమలు అయ్యేవిధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని భరోసా ఇచ్చారు.ప్రతి ఒక్కరు కూటమి గెలుపుకు శక్తివంచన లేకుండా కృషి చేశారన్నాను. కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందని తెలిపారు.నియోజకవర్గంలో కార్యకర్తలు, పార్టీల మధ్య విభేదాలు ఉన్నా అన్ని



మాట్లాడుతున్న రమేష్ బాబు

త్వరలోనే సద్దుమనుగుతాయన్నారు. సమస్యలు ఉంటే తమకు తెలిజేయాలని, తక్షణమే పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పార్టీలోకి చేరిన 200 మందికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో చోడవరం ఇంచార్జి రాజు, అరకు పార్లమెంట్ ఇంచార్జి వంపూరు గంగులయ్య, నర్సీపట్నం ఇంచార్జి రాజన్న సూర్య చంద్ర, మాడుగుల మండల అధ్యక్షుడు గవ్రెడ్డి శివాజీ, కార్యదర్శి దాసరి అచ్యుతరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు గుమ్మడి శ్రీరామ్, వీర సురేఖ పాల్గొన్నారు.



కలిసిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-రావికమతం:మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో2004- 2005 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల కలయిక ఆదివారం ఘనంగా జరిగింది. హైస్కూల్ ప్రాంగణంలో ఒకరి నొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఎక్కడెక్కడో, ఉద్యోగ, వ్యాపార, పలు రంగాల్లో స్థిరపడ్డ వారందరూ ఒకరినొకరు కలిసి పరిచయం చేసుకున్నారు.మనలో ఏ ఒక్కరికి ఎటువంటి సమస్య తలెత్తినా మిగిలిన వారందరూ కూడా సహాయ పడాలని తీర్మానం చేసుకున్నారు.

పాడి రైతులకు సన్మానం

ప్రజాశక్తి -అచ్యుతాపురం :హెరిటేజ్ డెయిరీకి అధిక పాలను సరఫరా చేస్తున్న దొప్పెర్ల శివారు రాయగరువు పాడి రైతులు కె.రవణమ్మ, కె.మాలతి, కె పుష్పలను ఆదివారం హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కె శేషు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాడిరైతుల సంక్షేమానికి హెరిటేజ్ డెయిరీ పలు ప్రోత్సాహకాలను అందిస్తోందన్నారు. తద్వారా అధిక పాల ఉత్పత్తితో రైతులు ఆర్థికంగా లాభం పొందుతారన్నారు. మేలు జాతి ఆవుల పెంపకం, పశు పోషణ, పశుగ్రాసం, పశుదాణా యాజమాన్యాలపై వివరించారు. హెరిటేజ్ డెయిరీ అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించి, పాడిరైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సిహెచ్ రాము, కె.వెంకటరావు, కె.శ్రీను, సరోజిని, సన్యాసిరావు, సన్యాసినాయుడు పాల్గొన్నారు.



పాడిరైతులను సత్కరిస్తున్న హెరిటేజ్ మేనేజర్ శేషు



క్రీడాకారులతో రాజేష్

జాతీయ స్థాయి పోటీలకు ఇద్దరు ఎంపిక

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:తమిళనాడులోని నమ్మకల్ జిల్లాలోని కేఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజీలో జరగనున్న 25వ నేషనల్ వుష టోర్నమెంట్ కు నర్సీపట్నంకు చెందిన సబ్ జూనియర్ స్థాయిలో పళ్ళ ప్రణీత్ (30 కేజీలు) శెట్టి శ్రీ రామ్ నిహాల్ (35 కేజీ ల) విభాగం లో పాల్గొంటున్నట్లు చైర్మన్ వెలగ నారాయణరావు తెలియజేశారు. వీరికి పూర్తి శిక్షణలను ఇచ్చినట్లు కోచ్ వేపాడ ప్రియాంక తెలిపారు. ప్రణీత్, నిహాల్‌ను స్పీకర్ తనయుడు, కౌన్సిలర్ చింతకాయల రాజేష్ ఆదివారం అభినందిస్తూ మెడల్ తీసుకు రావాలని ప్రత్యేకంగా ఆకాంక్షించారు. జిల్లాలో నర్సీపట్నం ముందు ఉందని కోచ్ ప్రియాంక ని కూడా అభినందించారు.

డిగ్రీ విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:యూనివర్శిటీ స్థాయిలో మొదటి, రెండు స్థానాలను సాధించిన నర్సీపట్నం అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు స్పీకర్ అయ్యన్న అభినందనలు తెలిపారు. ఈ విజయం ఎంతో గర్వకారణమని ప్రశంసించారు. బీకాం చదువుతున్న విద్యార్థి చీమల దుర్గాప్రసాద్ యూనివర్శిటీ స్థాయిలో మొదటి ర్యాంకు, అనిమిరెడ్డి సత్య హేమలత రెండవ ర్యాంకు సాధించారు. నర్సీపట్నం పేరును విద్యారంగంలో ప్రతిష్టాత్మకంగా నిలిపిన ఈ విద్యార్థులు అందరికీ ఆదర్శంగా నిలుస్తారని స్పీకర్ అన్నారు.విద్యార్థుల కృషి, అధ్యాపకుల నిబద్ధతతోనే ఈ ఘనత సాధ్యమైందని కొనియాడారు.



స్పీకర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న డీలర్లు

స్పీకర్ అయ్యన్నను కలిసిన డీలర్లు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: రేషన్ మొబైల్ వాహనాలు రద్దు చేసి, డీలర్లకు పాత విధానాన్ని మళ్లీ అమలు చేసినందుకు గాను రేషన్ డిపో అసోసియేషన్ సభ్యులు ఆదివారం రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో అయ్యన్నపాత్రుడను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ, వృద్ధులకు, వికలాంగులకు రేషన్ సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండానే వారి నివాసాల వద్దకే సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని డీలర్లకు సూచించారు.

నేడు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 26న సోమవారం ఉదయం 10 గంటలకు ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎంపిడిఒ పి.పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పాల్గొని, శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

చాపరాయిలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:పర్యాటక కేంద్రంగా ప్రఖ్యాతి గాంచిన మండలంలోని చాపరాయి జలపాతంలో ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు సందర్శించి సందడి చేశారు. దీంతో, పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం పర్యాటకులతో కిటకిటలాడింది. వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు.

చెరువులను తలపిస్తున్న రహదారులు

ప్రజాశక్తి- కోటవురట్ల:మండల కేంద్రంలో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారి మండల పరిషత్ కార్యాలయం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద చినుకు పడితే చాలు చెరువులను తలపిస్తున్నాయి. ఒకరోజు కొద్దిపాటి వర్షం పడితే చాలు వారం రోజుల వరకు నీరు అలాగే దర్శనమిస్తుంది.దీంతో వాహనదారులు సహా పాదచారులు, రైతులు, విద్యార్థులు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఏదో గడిచిన నెల రోజులుగా రెండు నెలలుగా ఉన్న సమస్య కాదు దాదాపు 6 సంవత్సరాలుగా ఇదే పరిస్థితి అయినా ఏ ఒక్క అధికారి, నాయకుడు పట్టించుకున్న దాఖలాలు లేవు.

ఒకరోజు వర్షం పడితే దాదాపు పది రోజుల వరకు నీరు ఎటు వెళ్ళక పోవడం విశేషం. దీంతో రోడ్డుపై నిత్యం నీరు అలా నిలిచిపోయి ఉండడంతో దుర్గంధం సైతం వెదజల్లుతుంది. వాహనాల రాకపోకలు సాగించేటప్పుడు పాతదారులపై మురికి నీళ్ల మీదకి తూలడంతో ఇబ్బందులు పడుతున్నారు. వర్షం అధికంగా కురిస్తే మండల పరిషత్ కార్యాలయంలోకి నీళ్లు ప్రవేశిస్తాయి. అయినా అధికారులు పట్టించుకోకపోవడం విశేషం.

రహదారిని అనుకుని కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో పాటు సమీప ప్రాంతంలో ఇళ్ల నిర్మాణానికి పర్మిషన్ ఇచ్చేటప్పుడు రోడ్డు మార్గంతో పాటు పార్కింగ్ స్థలం కేటాయించాలి. అటువంటి నిబంధనలు ఏమీ లేకుండా నిర్మాణాలు చేపట్టడం తో ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రధాన రహదారిని అనుకుని తహసిల్దార్ కార్యాలయం నుంచి ప్రధాన కూడలి వరకు కాలువలు నిర్మించినా కాలువలపై సిమెంట్ పలకలు వేసి దుకాణదారులు ఆక్రమణకు పాల్పడ్డారు. దీంతో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో పాటు రోడ్లపై నుంచి ప్రవహిస్తుంది. అధికారులు ఆవైపు కన్నెత్తి కూడా చూడకపోవడం విశేషం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలం పూర్తికావస్తున్నా కనీసం నాయకులు పట్టించుకోలేదంటూ విమర్శలు వినిపిస్తున్నారు. అధికారులు, నాయకులు ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్ర వాసులు కోరుకుంటున్నారు.



కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద చేరిన నీరు

అసోసియేట్ ప్రొఫెసర్ నుంచి చీఫ్ ఇంజినీరు వరకూ..

శివప్రసాదరాజుది ప్రత్యేక ముద్ర

- విశాఖకు తాగునీరందించే రైవాడ పథకంలో కీలక పాత్ర
- నగరంలో పలు ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం
- క్రియాశీలత, నిబద్ధత, నిత్య పర్యవేక్షణతో గుర్తింపు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఇంజినీరుగా రాణించడమంటే సృజనాత్మకత... నిబద్ధత.. పర్యవేక్షణ.. సమయ పాలన ఎంతో కీలకం. క్షేత్రస్థాయిలో ప్రాజెక్టుల అమలు శాస్త్రబద్ధంగా సాగాలంటే.. తలెత్తే సమస్యల పరిష్కారానికి అవసరమైన నైపుణ్యం కూడా అంతే కీలకం. నాలుగు దశాబ్దాలుగా ఇంజినీరింగ్ రంగంలో ప్రధానమైన బాధ్యతలను నిర్వర్తిస్తూ వస్తోన్న మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ (జివిఎంసి) చీఫ్ ఇంజినీరు పెన్మత్స శివప్రసాద రాజు ప్రయాణం ఆ కోవకు చెందినదనే చెప్పాలి. విశాఖపట్నం నగర ప్రజలకు తాగునీరందించే అత్యంత ప్రధానమైన రైవాడ వాటర్ సప్లయి స్కీంను 1994లో రూ.342 కోట్లతో చేపట్టిన ఘనతలో అప్పటి ఇంజినీరుగా పనిచేసిన నేటి చీఫ్ ఇంజినీరుది ప్రధానమైనదిగా చెప్పొచ్చు. ఈ నెలాఖరుకు ఉద్యోగ విరమణ పొందబోతున్న ఆయన్ని 'ప్రజాశక్తి' పలుకరించగా తన ఉద్యోగ ప్రస్థానంలోని పలు విషయాలను, విశేషాలను చెప్పుకొచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..



ఇంజినీర్ జీవితం సంతృప్తినిచ్చిందా?

ఇంజినీరుగా అనేక ప్రాజెక్టులను పూర్తి చేయడం సంతృప్తిగానే అనిపించింది. అయితే విద్యార్థి దశలో ఉన్నప్పుడు డాక్టర్ (వైద్య వృత్తి)లో స్థిరపడాలని ఇంటర్‌లో బైపిసి తీసుకున్నాను. కానీ ఇంజినీరు అయ్యాను. ఏలూరు సిఆర్ఆర్ కాలేజీలో ఒక అధ్యాపకులు మేథమేటిక్స్‌లో మంచి మార్కులు వచ్చాయని, డాక్టర్ ఎందుకు.. ఇంజినీరింగ్ చదవాలని చేసిన ఒత్తిడి నా మనసుపై పడింది. ఇంజినీరింగుపై ఇష్టం లేకపోయినా చేరాల్సి వచ్చింది.

మీ స్వస్థలం, మీ ఉన్నత చదువుల గురించి చెబుతారా ?

పశ్చిమ గోదావరి జిల్లా రేలంగి మా స్వస్థలం. పదో తరగతి వరకూ ప్రభుత్వ హైస్కూల్‌లోనే అభ్యసించాను. ఇంటర్ ఏలూరు సిఆర్ఆర్ కాలేజీలో చదివాను. బిటెక్ శ్రీవేంకటేశ్వరా యూనివర్శిటీ (తిరుపతి)లో పూర్తిచేశాను. ఎం టెక్ ఇంజినీరింగును విశాఖపట్నం ఆంధ్రా యూనివర్శిటీలో అభ్యసించాను. అసోసియేట్ ప్రొఫెసర్‌గా జి.పుల్లారెడ్డి ఇంజినీరింగు కాలేజీ (కర్నూలు)లో తొలుత జాబ్‌లో చేరాను.

ఉమ్మడి రాష్ట్రంలో ఏయే స్థాయిల్లో మీ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు?

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి)లో 2012-2015 మధ్య కాలంలో మూడేళ్లపాటు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా పనిచేశాను. విఎంఆర్‌డిఎ (విశాఖపట్నం)లో చీఫ్ ఇంజినీరుగా, 2014-2019 మధ్య సిఆర్‌డిఎ సిఇగా పనిచేశాను. విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్‌లలోనే అత్యధికంగా విధులను నిర్వర్తించాను. విశాఖలో ఎయిర్ క్రాఫ్ట్ మ్యూజియంను పూర్తిచేయడం జరిగింది. ఇక్కడే సాగర తీరంలో ఓసెన్ డెక్ పార్క్‌కు రూ.99 కోట్లతో టెండర్లను పిలిచాం. ఈ ప్రాజెక్టుకు త్వరలో సిఆర్‌జెడ్ అనుమతులు రానున్నాయి.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న టిడిపి టౌన్ అధ్యక్షులు నరేష్

గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి- వడ్డాది : ప్రతి ఒక్కరూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని వడ్డాది టౌన్ టిడిపి అధ్యక్షుడు దొండా నరేష్ అన్నారు వడ్డాదిలో అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తైక్వాండో, యోగా వేసవి ఉచిత శిక్షణ ముగింపు సందర్భంగా నరేష్ మాట్లాడుతూ విద్యార్థులకు వేసవి సెలవుల్లో విద్యార్థులకు వివిధ క్రీడలు, అంశాలపై నిర్వహించిన శిక్షణకు మంచిస్పందన రావడం అభినందనీయమన్నారు. ఆత్మరక్షణ, ఆరోగ్య సంరక్షణలకు కీలకంగా మారిన నేటిరోజుల్లో తైక్వాండో, యోగాలో 30 రోజుల శిక్షణ ఎంతో ప్రయోజనకరమన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు,పలువురు నాయకులు పాల్గొన్నారు.

నక్కపల్లి:

మండలంలోని చినదొడ్డగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్ధన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు సామెతల పై అవగాహన కల్పించారు.నేటి ఆధునిక జీవన విధానంలో మరుగున పడుతున్న తెలుగు భాషలో ఉండే సామెతలు, వాటిలో దాగివున్న చమత్కారాలు, గొప్పతనాన్ని గురించి వివరించారు. సందర్భాన్ని బట్టి సామెతలను ఎలా ఉపయోగిస్తారో తెలియజేశారు. విద్యార్థులతో నీతి కథల పుస్తకాలను చదివించి, నీతిని వివరించారు. పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి

తెలుగు దినపత్రిక

సిపిఎం సీనియర్ నాయకులు
కామ్రేడ్ పి.వై.వి.రమణారావు
సంస్మరణ ప్రత్యేక అనుబంధం

Advt. Feature

గాజువాక, విశాఖపట్నం | సోమవారం 26-05-2025 | 8 పేజీలు



చైతన్య దీప్తి రమణారావు



ప్రజాశక్తి - గాజువాక

బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరొందిన సిపిఎం సీనియర్ నాయకులు పివైవి.రమణారావు (74) ఈ నెల 13న ఉదయం వేళ గాజువాక పోలీస్ స్టేషన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం పలువురిని కలిచివేసింది. గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రజాశక్తి దినపత్రికను పాఠకులకు అందించేందుకు వెళ్తున్న ఆయనను రాంగ్ రూట్‌లో మోటారు బైకుపై వచ్చిన ఓ వ్యక్తి ఢీకొట్టడంతో కన్నుమూశారు. తుద వరకూ కమ్యూనిస్టుగా బతికిన రమణారావు మృతి అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది.

రమణారావు 1951 ఆగస్టు 12న విజయవాడ బందరు దగ్గర కొత్తపూడిలో జన్మించారు. విద్యాభ్యాసమంతా విజయవాడలో కొనసాగింది. 1973లో బిహెచ్‌పివిలో ఉద్యోగిగా చేరారు. 1981లో సిపిఎంలో సభ్యత్వం తీసుకున్నారు. పార్టీ శాఖా కార్యదర్శిగానూ, బిహెచ్‌పివి ఎఫ్‌సి, గాజువాక జోన్ కమిటీ, ఎడ్యుకేషన్ సబ్ కమిటీ సభ్యునిగానూ బాధ్యతలు నిర్వహించారు. క్రమశిక్షణ కలిగిన పార్టీ నాయకులు. డివైఎఫ్‌ఐలోనూ పనిచేశారు. కళాకారుడుగా 1980లో బిహెచ్‌పివిలో ప్రజానాట్య మండలిని నిర్మించారు. పలు కళా ప్రదర్శనలు ఇచ్చారు. హల్లాబోల్ వీధి నాటిక, ప్రజా ఉద్యమ నాటికలు సుమారుగా 600 ప్రాంతాల్లో ప్రదర్శించారు. ఎవ్వనిచే జనించు, ఉప్పెన వచ్చింది, నరకం మరి ఎక్కడలేదు, రాయి మొదలగు నాటికలను జాతీయంగా ప్రదర్శనలు ఇచ్చారు. బహుమతులు సాధించారు. గాజువాక ప్రాంతంలో సిపిఎం బలోపేతానికి కృషి చేశారు. ఇళ్ల స్థలాల పోరాటంలో కీలకభూమిక పోషించారు.

ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. కార్మికులకు రాజకీయ విద్య చెప్పడంలో గట్టి కృషి చేశారు. సాహిత్యం అమ్మకం, ప్రజాశక్తి చేర్పింపు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ప్రజా ఉద్యమ నిర్మాణంలోకి కుటుంబాన్ని తీసుకొచ్చారు. బిహెచ్‌పివిలో జరిగిన అన్ని ఉద్యమాల్లోనూ పాల్గొన్నారు. ఆయన ఎలక్ట్రీషియన్ కావడం వల్ల పార్టీ నిర్మించిన భవనాలన్నింటికీ ఎలక్ట్రికల్ వర్క్ చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతి అనంతరం కుటుంబీకులు ఆయన నేత్రాలను దానం చేశారు.

- ◆ **బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు**
- ◆ **కడవరకూ ఎర్రజెండా పోరాటాల్లో మమేకం**

విశాఖ కార్మికోద్యమం అందించిన రత్నం రమణారావు

కామ్రేడ్ రమణారావు దుర్మరణం ఎంతమందికో వ్యథను మిగిల్చింది. కుటుంబం మొత్తం పార్టీకి అంకితమైంది. అందరితోనూ ఆత్మీయ సంబంధాలు ఉండేవి. నాకు బాగా సన్నిహితమైన కుటుంబం. ఎన్నికలకు వచ్చినప్పుడు కూడా వాళ్ళ ఇంట్లో ఉన్నాను. పైపై మర్యాదలు, ముఖప్రీతి మాటలు కనిపించవు. ఆ మాటల్లోనూ, ఆ చూపుల్లోనూ ఒక ఆత్మీయత. మనం అనే భావం. బంధుత్వాలను మించిన బంధం.

74 సంవత్సరాల వయసులో ఇంటింటికి తిరిగి పేపర్ వేయడానికి ఉదయాన్నే బయలుదేరటమే ఆయన అంకితభావానికి నిదర్శనం. కాస్తంత పనికే ఎంతో కష్టపడి పోయామని అనుకుని పేరు రాలేదని, పదవులు రాలేదని బాధపడిపోయే ఈ రోజుల్లో, వ్యక్తిగత కాంక్ష తప్ప చుట్టూ ఉన్న జనం గురించి ఆలోచించేవాళ్ళు కరువవుతున్న ఈ రోజుల్లో పత్రికను ఉదయాన్నే ప్రజలకు అందించాలన్న కాంక్షతో బయలుదేరిన రమణారావు మళ్ళీ సజీవంగా ఇంటికి రాలేదు. కామ్రేడ్ రమణారావు బిహెచ్‌పివిలో ఎలక్ట్రీషియన్. 1970 దశకంలో సిఐటియు ఉద్యమానికి దగ్గరయ్యాడు. అప్పటి నుంచి వెనుతిరిగి చూడలేదు. తన వంతు కృషి చేస్తూనే భార్య సుభద్రను, పిల్లలను కూడా పార్టీకి అందించారు.

అప్పటి జ్ఞాపకాలన్నీ మెదడులో సుడులు తిరుగుతున్నాయి. చిన్నగంట్యాడ పార్టీకి ఒక కేంద్రం. కామ్రేడ్ సత్తిరాజు భవనం కట్టిన అనంతరం అక్కడ అనేక కుటుంబాలు ఉండేవి. సిహెచ్.నర్సింగరావు, శారద, సుబ్బారావు, మణి, సత్యనారాయణ, అనసూయతో పాటు రమణారావు, సుభద్ర కుటుంబం, ఇంకా మరి కొంతమంది సిఐటియు నాయకులు, కార్యకర్తలు ఉండేవారు. నేను రాఘవులు టౌన్ నుంచి వచ్చి ఒక నాలుగు నెలలు అక్కడే ఉన్నాం. సత్యనారాయణ ఇంట్లో ఉండి, మణి చేతి వంట తింటూ అనేక కార్యక్రమాలు చేసేవాళ్లం. రోజూ ఉదయం, సాయంత్రం ఒక గంట క్లాస్ నడిచేది. ఆ సందర్భంలోనే ఆటోనగర్ యూనియన్ ఏర్పాటు కోసం పెద్ద పోరాటాలు జరిగాయి. గుర్తున్నంత మటుకు ఒక సంవత్సరం పాటు క్వారీ కార్మికుల పోరాటాలు జరిగాయి. ఇట్లా మరెన్నో.

గాజువాక, చిన్న గంట్యాడ ప్రభుత్వ రంగ సంస్థల కార్మికులకు, ప్రైవేటు ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులకు కూడా ఒక కేంద్రంగా ఉండేది. అందరం కలిసి కూర్చున్నామంటే, ఎక్కడ ఏం జరిగింది అన్న ఉద్యమ వార్తలు తప్ప పోసుకోలు కబుర్లు వచ్చేవి కాదు. పబ్లిక్ సెక్టార్ నాయకులు చిన్నాచితక ప్రైవేటు సంస్థల కార్మికులను సంఘటితం చేశారు. కార్మిక సంఘ నిర్మాణంతో పాటు, సిఐటియు నాయకులు వారి కుటుంబాల్లో ఉన్న స్త్రీలను మహిళా ఉద్యమం వైపు ప్రోత్సహించారు. ఉద్యమానికి సహకరించారు. పిల్లల్ని విద్యార్థి ఉద్యమానికి దగ్గర చేశారు. సత్తిరాజు భవనం దగ్గరే ఖాళీ స్థలంలో వాలీబాల్, రింగ్ వంటి ఆటలాడేవాళ్లం. అక్కడే మహిళలు గోగ్రహణం నాటిక నేర్చుకొని జిల్లా మహాసభలో ప్రదర్శించారు. అక్కడే టివిఎస్‌లు, లూనాలు, మోపెడ్లు నేర్చుకున్నాం. ఎక్కడికి వెళ్లాలన్నా కామ్రేడ్స్ బండి మీద తీసుకెళ్లి దించేవాళ్ళు. అది ఒక గొప్ప అనుభూతి. ఒక పెద్ద అనుభవం. మొత్తం లెక్కిస్తే ఈ అనుభవాలు ఎంతోమందికి తోడ్పడతాయి.

అప్పటి కార్మిక ఉద్యమం చాలా గొప్ప అనుభవాలను ఇచ్చింది. అప్పుడే కాదు, ఇప్పుడు, ఎప్పుడు కార్మిక ఉద్యమం గొప్ప అనుభవాలనే ఇస్తుంది. అది మనమందరం ఒక్కటే అనే అనుబంధం ఇస్తుంది. దోపిడీని, దౌర్జన్యాన్ని నిర్మూలించాలి అనే పట్టుదల, పోరాట స్ఫూర్తి ఆ బంధంలో కనపడుతుంది. ఈ బంధానికి కులాలు లేవు. మతాలు లేవు. ప్రాంతాలు లేవు. ఇవాళ ఎక్కడబడితే అక్కడ కుల సంఘాలు పెట్టుకుని, మతం పేరుతోనూ, ప్రాంతాల పేరుతోనూ కొట్టుకు చస్తున్నారు. కొట్లాడుకునేట్లు రాజకీయ నాయకులు చేస్తున్నారు. కానీ కార్మిక ఉద్యమం అటువంటిది కాదు. అనేక మందిమి కలిసి పని చేశాం. కానీ ఎవరిది ఏ కులం, ఏ ప్రాంతం అని ఎప్పుడూ అనుకోలేదు. అడగనూ లేదు. ఒకవేళ తెలిసినా అది ఎప్పుడూ ఎవరినీ ప్రభావితం చేయలేదు. ఏ కులం అంటే 'కార్మికులం'అనే మాటే. ఇది కార్మిక ఉద్యమం అందించిన ఒక గొప్ప అనుభవం. ఇంత గొప్ప అనుభవం వచ్చిందంటే అందుకు ట్రేడ్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు, సభ్యులు అందరూ భాగస్వాములే. కుటుంబాల్లో పిల్లలు కూడా తమకు తాము బంధువులమని అనుకునేవారు. ఎవరికీ వాళ్ళ కులాలేంటో, ప్రాంతాలేంటో తెలియదు. ఎవరికి వాళ్ల అక్కచెల్లెళ్ల పిల్లలుగాను, అన్నదమ్ముల పిల్లలుగాను పెరిగారు. అనేక ప్రాంతాల నుండి వచ్చినవారు కావడంతో సుదూర ప్రాంతాల్లో ఉండేవారి కుటుంబాలకు, దగ్గర బంధువులకు దూరంగా ఉన్నారు కనుక కార్మికులతోపాటు కార్మిక కుటుంబాలుకూడా స్త్రీలు, పిల్లలు కూడా ఇక్కడు ఉన్న వారితో అవినాభావ సంబంధాలు పెంచుకున్నారు. గట్టిగా చెప్పాలంటే స్త్రీలకు సంఘాలు పుట్టిల్లు. పిల్లలకు ఈ సంఘాలు అమ్మమ్మలు, నాన్నమ్మల ఇళ్లుఅయ్యాయి.




ఈ మొత్తం కృషిలో రమణారావు ఉన్నాడు. కానీ రమణారావు మాట ఎప్పుడు గట్టిగా వినబడేది కాదు. నిశ్శబ్ద విప్లవకారుడు. ఆయన గొప్ప ఎలక్ట్రీషన్. ఎంత టెక్నీషియన్ అంటే, బయట నుంచి వచ్చి అలసిపోయినట్లు కింద నేల మీద గోడకానుకుని 'అమ్మ' అనుకుంటూ చేతులతోటి తప్పట్లు కొట్టేవాడు. ఆ శబ్దానికి ఫ్యాన్ తిరిగేది. పడిపడి నవ్వుకునేవాళ్ళం. అజ్ఞాత, అవిశ్రాంత యోధుని దుర్మరణం అందరినీ కలచి వేసింది.

- ఎస్.పుణ్యవతి,
సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు



సిపిఎం బహిరంగ సభలో పాల్గొన్న కామ్రేడ్ రమణారావు

ఆదర్శ కమ్యూనిస్టు రమణారావు



పివైవి.రమణారావు మే 13న అకస్మాత్తుగా మరణించడం విశాఖ జిల్లా సిపిఎం కార్యకర్తలందరికీ తీవ్ర బాధ కలిగించింది. ప్రజాశక్తి పేపర్ వేసే బోయ్ రాలేదని రమణారావు ఉదయం 5 గంటలకు ప్రజాశక్తి పత్రికను పంపిణీ చేయడానికి బయలుదేరి రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ మరణ వార్త నాకు తీవ్ర ఆవేదన కలిగించింది. రమణారావు ఆదర్శ కమ్యూనిస్టు. జీవితాంతం కమ్యూనిస్టు ఆశయాలను నూరు శాతం అమలు చేసిన కార్యకర్త. 74వ సంవత్సరం వయసులో కూడా విశ్రాంతి తీసుకోకుండా ప్రజాశక్తి పత్రికను వేయడమే కాకుండా నిరంతరం ప్రజలతో సంబంధాలతో పనిచేసిన కార్యకర్త. ఆయన కుటుంబ అవసరాలకు పార్ట్ టైం జాబ్ చేస్తూ కూడా పార్టీ పనిని ఏ రోజూ నిర్లక్ష్యం చేయలేదు. పార్టీ పని ఉందంటే ఆయన చేసే ఉద్యోగం, పనికి సెలవు పెట్టేవారు. జీవితాంతం ఒక ఆదర్శ కమ్యూనిస్టుగా పనిచేసినటువంటి ఇటువంటి కార్యకర్తలు మన అందరికీ కూడా ఆదర్శమూర్తులుగా నిలుస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఆయన చిన్న వయసులో దేశ భక్తి పేరుతో ఆర్ఎస్ఎస్ పట్ల ఆకర్షించబడ్డారు. కానీ విశాఖపట్నం బిహెచ్‌పివిలో ఉద్యోగంలో చేరిన తర్వాత ఆయన స్వయంగా సిఐటియు యూనియన్ పని తీరును పరిశీలించారు. ఆర్ఎస్ఎస్‌లో ఉండగానే వర్గ పోరాటానికి ఆకర్షితుడై, ఆర్ఎస్ఎస్ కాదు వర్గ పోరాటం ఒక్కటే కార్మిక వర్గానికి విముక్తి కలిగిస్తుందని నమ్మి సిపిఎంలో 1984లో చేరారు. ఆనాటి నుంచి ఆయన చనిపోయే క్షణం వరకూ పార్టీ కోసం పని చేశారు. కమ్యూనిస్టు ఆశయాలతో జీవితమంతా కృషి చేశారు. ఆచరించారు. కుటుంబాన్ని, ఇద్దరు ఆడపిల్లలను ఎస్ఎఫ్ఐలో పనిచేసేలా ప్రోత్సహించారు. ఎస్ఎఫ్ఐలో పని చేసే కార్యకర్తను అల్లుడిగా చేసుకున్నారు. మనవడికి 'హష్మీ' పేరు పెట్టి కమ్యూనిస్టు వారసత్వాన్ని కొనసాగించడంలో కృషి చేశారు.

రాజీవ్ గాంధీ చనిపోయిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ దాడులు పార్టీపై చేయడానికి పూనుకున్నప్పుడు సత్తిరాజు భవన్‌ను కాపాడడానికి రాత్రింబవళ్లు దివిటీలతో కాపలాకాశారు. రమణారావుతో పాటు ఆయన భార్య ఇద్దరూ ఉన్నారు. 1980 నుంచి పార్టీ, ప్రజా ఉద్యమాలకు చినగంట్యాడ సత్తిరాజు భవన్ కేంద్రంగా ఉంది. పార్టీ ఆఫీసు చుట్టూ ఉన్నవారంతా ఒక కుటుంబంగా కలసిమెలసి జీవించేవారు. పార్టీ అవసరాలకు ముందుకు వచ్చి పనిచేసిన వారిలో రమణారావు అగ్రభాగంలో ఉండేవారు. ఆయన విద్య కోసం ఎంతో శ్రమించేవారు. రాజకీయ విద్య వల్లనే పార్టీ అభివృద్ధి అవుతుందని నమ్మి ఆయన స్వయంగా పార్టీ ఆఫీసులో ఒక గ్రంథాలయాన్ని నడిపారు. ప్రజాశక్తి పుస్తకాలు అమ్మకాలు ఆయనే చేసేవారు. సాహిత్యాన్ని ప్రచారం చేయడంలో అగ్రభాగాన ఉండేవారు. క్లాసులు నిర్వహించడంలో అత్యంత చొరవ ప్రదర్శించేవారు. నిరంతరం గాజువాక కార్యాలయం ఒక పాఠశాలగా రమణరావు ఆధ్వర్యాన మారింది. ఆయన కృషి ఫలితంగా చుట్టూ ఉన్న వారంతా ఒక కుటుంబంగా కలసి పార్టీకి సహకరించేవారు. అందరూ కలిసి ప్రతిరోజూ సాయంత్రం ఆటలాడుకోవడం ఆ ప్రాంతాన్ని ఒక ప్లే గ్రౌండ్ లాగా మార్చి కుటుంబాలు సమిష్టిగా ఎలా ఉండాలో ఒక ఆదర్శవంతంగా ఆచరణలో చూపించారు. రమణారావు జీవితంలో అత్యంత ముఖ్యమైనది ప్రజలతో కలిసి పనిచేయడం. ఆనాడు ప్రారంభించినటువంటి అనేక ప్రాంతాల్లో నివాస ప్రాంతాల పని బలహీనపడినా చిన్న గంట్యాడ ప్రాంతంలో ఈరోజుకీ నివాస ప్రాంతంలో ప్రజలతో నిత్య సంబంధాలు కలిగి ఉండడంలో రమణారావు పాత్ర అమూల్యమైనది. అందుకే నివాస ప్రాంతాల పనిని ఆయన జీవితంలో ఆదర్శంగా మనం అమలు చేయాలి. ప్రతి సంవత్సరం ఆ ప్రాంత ప్రజలతో ఒక పిక్నిక్ నిర్వహించేవారు. ప్రజాశక్తి పేపర్ పంచడంతో పాటు ప్రతి ఒక్క కుటుంబం దగ్గరకు వెళ్లి పరామర్శ చేయడం, ప్రతి కుటుంబంతో వ్యక్తిగత సంబంధాలు కలిగి ఉండటం రమణారావులో ప్రత్యేకత. అందువల్లనే చినగంట్యాడ ప్రాంతంలో ప్రజలతో నిత్య సంబంధాలు కొనసాగాయి. వారికి సేవా కార్యక్రమాలు నిర్వహించడం, సలహాలు ఇవ్వడం స్థానిక ఉద్యమాల్లో వారంతా పాల్గొనేట్టు చేయడం రమణారావు జీవితంలో చాలా అతి ముఖ్యమైన ఆదర్శదాయక పనులుగా ఎప్పటికీ నిలుస్తాయి.

రమణారావు ఆదర్శాలను అమలు చేయాలి


రమణారావు నిజ జీవితంలో కమ్యూనిస్టుగా అమలు చేసిన ఆదర్శాలను అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పార్టీ లెవీ చెల్లించడంలో ఆయన ఆదర్శంగా నిలిచేవారు. ఆయన పార్టీలో చేరిన దగ్గర్నుంచీ జీవితాంతం ప్రతి నెలా ఒకటో తేదీకి పార్టీ లెవీ చెల్లించడం, చెల్లించని వారిని ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించడం చేసేవారు. వ్యక్తిగతం కంటే పార్టీ ప్రధానం, పార్టీ తర్వాతే మనం వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవాలి అని ముఖ్య కార్యకర్తలతోనూ, తోటి సహచరులతోనూ ఆయన నిరంతరం చెప్పేవారు. పార్టీకి అటువంటి ప్రాధాన్యత ఇచ్చిన కార్యకర్తలే ఈనాటికీ సిపిఎంకు పెట్టుబడి. అందువల్లనే సిపిఎం అనేక ఇబ్బందుల్లో కూడా పార్టీ నేటికీ నిలబడగలిగిందంటే రమణారావు లాంటి ఆదర్శ కార్యకర్తలే ప్రధానం.

- సిహెచ్.నర్సింగరావు,
సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



ప్రజలను చైతన్యం చేసే నాటికలో ప్రధాన పాత్రలో కామ్రేడ్ రమణారావు

చెక్కు చెదరని విశ్వాసానికి ప్రతిరూపం



దాదాపు 45 సంవత్సరాల పరిచయంలో ఎప్పుడూ రమణారావులో పార్టీ పట్ల విశ్వాసం చెక్కు చెదరకుండా అలాగే కొనసాగడం నేను చూశాను. ఉద్యోగంలో ఉన్నన్నాళ్ళూ అటు ఉద్యోగం, ఇటు పార్టీ పని- రెండూ నెరవేరుస్తూ వచ్చాడు. ఉద్యోగ విరమణ తర్వాత పార్టీ పని తప్ప వేరే వ్యాపకం లేదు. ఆ పార్టీ పనిలోనే కనుమూశాడు.

1990 ప్రారంభ దినాల్లో విశాఖపట్నంలో ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో పనిచేస్తూ పార్టీ వైపు వచ్చినవారిలో ఫ్యాక్టరీ యూనియన్ పనికి అవసరమైనవారుపోను తక్కినవారిని నివాస ప్రాంతాల్లో ఉద్యమాలను నిర్మించడానికి పార్టీ ప్రోత్సహించింది. అలా వచ్చిన పలువురు కార్యకర్తల్లో ముందుశ్రేణిలో రమణారావు ఉండేవారు. నివాస ప్రాంతాల్లో పేదల సమస్యలమీద పనిచేశారు. ప్రజల్లో చైతన్యభావాలను నాటేందుకు ప్రజానాట్యమండలి నిర్మాణంలో, కార్యకలాపాల్లో పాలు పంచుకున్నారు. చాలా కాలం పాటు గాజువాక డివిజన్ ప్రజాశక్తి బాధ్యతలను చూశారు. పార్టీ రాజకీయవిద్యా సబ్‌కమిటీ సభ్యుడిగా క్లాసులు బోధించడం, నిర్వహించడంలో పాలు పంచుకున్నారు. పార్టీ విధానాలను, పద్ధతులను ఖచ్చితంగా పాటించడమే గాక. నిక్కచ్చిగా వ్యవహరించేవారు.

భార్య కామ్రేడ్ సుభద్ర ఉద్యమ సహచరిణిగా మాత్రమే గాక, చినగంట్యాడ ప్రాంతంలో మహిళా నేతగా పెంపొందడానికి వెనుక రమణారావు ప్రోత్సాహం ఉంది. అన్ని సందర్భాలలోనూ పార్టీకి వారి కుటుంబం తోడుగా నిలిచింది.

యువతరం కార్యకర్తలు ఎన్నో విషయాలను నేర్చుకోదగ్గ కామ్రేడ్ రమణారావు.

జోహార్ కామ్రేడ్ రమణారావు!

కామ్రేడ్ సుభద్రకు, కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

- ఎంవిఎస్.శర్మ,
(గౌహతి నుంచి)





భావితరాలకు మార్గదర్శి



దేశంలో పేద గొప్ప అంతరాలు లేని సమసమాజం సాధించాలనే లక్ష్యాన్ని ఎంచుకొని, దాని సాధనకై తుదిశ్వాస వరకు అత్యంత నిబద్ధతతో పివైవి.రమణారావు కృషిచేశారు. ప్రభుత్వరంగ సంస్థ బిహెచ్‌పివిలో ఉద్యోగిగా పనిచేస్తూ గాజువాకలో ప్రజా సమస్యల పరిష్కారానికి, పార్టీ, ప్రజాసంఘాల అభివృద్ధికి ఆయన ఎనలేని కృషి చేశారు. కష్టజీవులను, కార్యకర్తలను సైద్ధాంతికంగా అభివృద్ధి చేసేందుకు ఆయన బోధించిన క్లాసులు, స్టడీ సర్కిల్స్‌లో 'శాస్త్రీయ ఆలోచన' పాఠ్యాంశం ముఖ్యమైనది. వివిధ స్థాయిల విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే భాషలో బోధించడం రమణారావు ప్రత్యేకత. సిపిఎం గాజువాక జోన్ కమిటీ సభ్యునిగా, శాఖా కార్యదర్శిగా పార్టీ నిర్ణయాలను విధేయతతో అమలు చేసేవారు. ప్రజా నాట్యమండలి నాయకునిగా కళారంగానికి ఆయన విశేషకృషి చేశారు. ఉద్యోగ విరమణ పొందిన తరువాత కూడా ఆయన కుటుంబానికి, ఇంటికే పరిమితంకాలేదు. ఉద్యమ బాటలోనే సాగారు.

దేశంలో ప్రధాన ప్రతికారంగం, మీడియా కార్పొరేట్లు, దోపిడీశక్తుల చేతుల్లోకి పోయాయి. వీరి ప్రయోజనాలే ప్రజల ప్రయోజనాలుగా వార్తలనందిస్తున్నాయి. కష్ట జీవులు ప్రజలలో, కులం, ప్రాంతం, భాష, మతోన్మాద భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్నాయి. వీటికి ప్రత్యామ్నాయంగా ఉన్న ప్రజాశక్తి పత్రికను పాఠకుల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, శ్రామిక ప్రజల ఐక్యతను బలోపేతం చేయాలనే సంకల్పంతో పత్రిక పెంపునకు కృషిచేశారు. గాజువాకలో పత్రిక నిర్వహణ బాధ్యత తీసుకున్నారు. పత్రిక పాఠకులకు అందజేసే 'బాయ్' అనారోగ్యంతో ఉండటంతో ఆ బాధ్యతను భుజస్కంధాలపై వేసుకున్నారు. 74 ఏళ్ల వయసులో కూడా ఉదయం 4 గంటలకు లేచి పత్రిక పంపిణీకి పూనుకున్నారు. ఈ క్రమంలోనే రోడ్డు ప్రమాదానికి గురై అశువులుబాసారు.

మరణం తరువాత పార్థివ దేహం ఎవరికీ పనికిరాకుండా మట్టిలో కలిసిపోవడం సరికాదనుకున్నాడు. బతికుండగానే జ్యోతిబసు దేహదాన ప్రోత్సాహక సంస్థ ద్వారా వైద్య విద్యార్థుల పరీక్షల నిమిత్తం దేహం దానానికి అంగీకార పత్రం రాసి ఇచ్చారు. రోడ్డు ప్రమాదం, పోస్టుమార్టం చేయాల్సి రావడంతో కెజిహెచ్ అనాటమీ విభాగం వారు దేహస్వీకరణకు నిరాకరించారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన కళ్లను దానం చేశారు.

రమణారావు తన లక్ష్య సాధనలో తన భార్య, కుటుంబ సభ్యులను సహితం భాగస్వాములను చేశారు. కుమార్తెలు చైతన్య, సుకన్య విద్యార్థి, పత్రికారంగంలో పనిచేశారు. భార్య సుభద్ర మహిళా సంఘం అభివృద్ధికి కృషిచేస్తున్నారు. రమణారావు మృతితో తీవ్ర విషాదంలో ఉంటూనే... ఆయన భౌతికకాయం పరిశోధనలకు ఉపయోగపడకుండా మట్టిలో కలిసిపోతోందని ఆమె కన్నీరు మున్నీరయ్యారు.

పార్టీ కార్యకర్తలు, నాయకులు మరణానంతరం దేహదానానికి వీలునామా రాసినా, కొందరి కుటుంబ సభ్యులు బయట ప్రభావానికి గురై దేహదానానికి అంగీకరించకపోవడం చూస్తున్నాం. కానీ రమణారావు పిల్లలు, కుటుంబసభ్యులు పార్టీ పద్ధతుల ప్రకారమే ఆయన అంత్యక్రియలు నిర్వహించాలని స్వచ్ఛందంగా కోరారు. తండ్రి చితికి పెద్ద కుమార్తె చైతన్య స్వయంగా నిప్పంటించింది. రమణారావు వీరిని ఆవిధంగా తయారు చేశారు.

రమణారావు బంధువులు, స్నేహితులు ఆయన అంత్యక్రియలు చూసి ఉత్తేజితులయ్యారు. ఈయన సిపిఎంలో పనిచేస్తున్నారని తెలుసు. అన్ని పార్టీలలాగే ఇది ఒక పార్టీ అనుకున్నాం కానీ ! రమణారావు ఇంత మంచి కృషి చేశాడా! ఈ పార్టీలో మరణించాక కూడా ఇంత గౌరవం ఉంటుందా ! అని మాట్లాడారు. వీరి సంప్రదాయం ప్రకారం మహిళలు శ్మశాన వాటికకు వెళ్లకూడదంట. కానీ! వీరందరూ గాజువాక శ్మశానవాటికలోకి వచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మహిళల సంప్రదాయాన్ని స్వచ్ఛందంగా పక్కకు నెట్టారు. ఈ విధంగా మరణించాక కూడా రమణారావు పలువురిని తన భావాల వైపు ఉత్తేజపరచడం గొప్ప విషయం.

పార్టీ లక్ష్యాన్ని స్వీకరించడం ఒక భాగమైతే.. ఆ లక్ష్య సాధనకు కష్టనష్టాలను అధిగమించి, అంకితమై నిబద్ధతతో తుది శ్వాస వరకు పనిచేయడం, భార్య, కుటుంబ సభ్యులను తన లక్ష్యానికి అనుగుణంగా మలిచే కృషి చేయడం గొప్ప విషయం. రమణారావు భౌతికంగా మన ముందు లేకపోయినా ఆయన పయనం, జీవితం భావితరాలకు ఆదర్శం. ఈ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడమే రమణారావుకు మనమిచ్చే ఘన నివాళి. ఈ కామ్రేడ్ అకాల మృతికి సిపిఎం విశాఖ జిల్లా కమిటీ తరపున శ్రద్ధాంజలి ఘటిస్తూ కుటుంబానికి సంతాపాన్ని తెలియజేస్తున్నాం.

అమర్ రహే కామ్రేడ్ రమణారావు...

- ఎం.జగ్గునాయుడు,
సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి







రమణారావు మృతి పార్టీకి తీరని లోటు

పివైవి.రమణారావు మృతి పార్టీకి, ఆయన కుటుంబానికి తీరని లోటు. ఉమ్మడి విశాఖ జిల్లాలో విద్యార్థి ఉద్యమంలో రమణారావు అల్లుడు కెపి.నాయుడు, ఆయన కుమార్తెలు చైతన్య, సుకన్య, నేను కలిసి పనిచేశాం. ఎస్ఎఫ్ఐ క్లాసులు నిర్వహించే సమయంలో రమణారావు చెప్పిన శాస్త్రీయ ఆలోచన క్లాసు నా అభివృద్ధికి ఉపయోగపడింది. గాజువాక పార్టీ అభివృద్ధిలో రమణారావు కీలకపాత్ర వహించారు. జోన్ కమిటీలో సభ్యులను చైతన్య పరిచేవారు. కమిటీ సభ్యులు, నాయకులు పార్టీ పద్ధతులు పాటించకపోతే క్షమించేవారు కాదు. ఏ బాధ్యత తీసుకున్నా క్రమశిక్షణగా నిర్వహించేవారు. 15 సంవత్సరాల నుంచి ప్రజాశక్తి బాధ్యత తీసుకుని పేపర్ ఆగకుండా రోజూ పర్యవేక్షించేవారు. ప్రజానాట్యమండలి బాధ్యత తీసుకొని సాంస్కృతిక ఉద్యమంలో ఏ రకంగా పనిచేయాలన్న విషయాలను ఆచరించారు. నేను పాయకరావుపేటలో పనిచేస్తూ, పార్టీ ఆదేశాల మేరకు కొత్తగా గాజువాక వచ్చిన సమయంలో నా కుటుంబానికి ఎంతో సహకరించారు. నన్ను పార్టీలో ముందుకు నడిపారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఘనమైన నివాళి.

- ఎం.రాంబాబు,
సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి

రంగస్థల నాటకాలతో పేరు ప్రఖ్యాతలు



రమణారావు బహుముఖ ఉద్యమ నిర్మాణ కార్యకర్త, కళాకారుడు, ఉపాధ్యాయుడు, నైపుణ్యం కలిగిన కార్మికుడు. పనిచేసిన బిహెచ్‌పివి పరిశ్రమలో సాంస్కృతిక రంగం బాధ్యునిగా అనేక రంగస్థల నాటకాలు ప్రదర్శించి పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. పరిశ్రమ తరుపున అనేక రాష్ట్రాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని బహుమతులు పొందారు. ముఖ్యంగా 'ఎవ్వనిచే జనించు' నాటకం మంచి పేరు తీసుకొచ్చింది. ఆయన శారీరక నిర్మాణం నాటకాల్లో వృద్ధుల పాత్రకు ప్రత్యేకం. ఆయన డైలాగ్ చెబితే ప్రేక్షకుల్లో కూడా కన్నీళ్లు తెప్పించే విధంగా పాత్రలో లీనమై నటించేవారు. ఆ తరువాత నివాస ప్రాంతాల్లో కృషికి పార్టీ ఇచ్చిన పిలుపులో భాగంగా 80వ దశకంలో తన ఇంటి చుట్టూ ఉన్న ఉద్యమ కార్యకర్తలు, మహిళలను సమీకరించి గోగ్రహణం వీధి నాటిక నేర్పించి పాలకొల్లులో జరిగిన మహిళా సంఘం రాష్ట్ర మహాసభలలో ప్రదర్శించారు. మహిళలందరినీ ప్రోత్సహించి పాటలు, నాటికలు, ఆటలు ఆడించి మహిళా సంఘం నిర్మాణానికి, పార్టీ నిర్మాణానికి క్షేత్రస్థాయిలో కృషిచేశారు. సత్తిరాజు భవనం నిర్మాణ సమయంలో ఎక్కువ సమయం కేటాయించి ఆ భవనానికి కావలసిన ఎలక్ట్రికల్ వర్క్ బాధ్యత తీసుకున్నారు. ఆయన ఇల్లు ఒక కార్యాలయంగా పనిచేసేది. విశ్వశాంతిని కాంక్షిస్తూ రచయిత నల్లి ధర్మారావు రాసిన ప్రపంచ శాంతి నృత్యరూపకాన్ని అనేక చోట్ల ప్రదర్శించారు. ఆ రూపకాన్ని భద్రపరచడానికి సత్తిరాజు భవన్‌లో వీడియో రికార్డింగ్ చేసే ప్రయత్నానికి సఫదర్ హష్మి సహకరించారు. వీధి నాటిక ఒక ప్రభంజనంలా సాగుతున్న సమయంలో వీధి నాటక ప్రక్రియలో కూడా ఆయన నటించి అనేక సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా జరిగిన నిరసన కార్యక్రమాలు, జాతాలు, ఎన్నికల్లో పనిచేశారు. కామ్రేడ్ హష్మి పేరు తన మనవడుకు పెట్టుకుని ఆ రకంగా నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి ఆర్థిక వనరులు సమకూర్చు కోడానికి జిల్లా 7వ మహాసభలు గాజువాకలో నిర్వహించి సహకరించారు. ఆ సందర్భంగా మహిళా డప్పుల దళం పాటల బృందం గాజువాక డివిజన్‌లో నిర్మించి జిల్లాలోనే ఆదర్శంగా నిలిచారు. విశాఖ జిల్లాలో జరిగిన పార్టీ అఖిలభారత మహా సభలు సందర్భంగా గాజువాక ప్రాంతంలో జరిగిన వైజాగ్ ఫెస్ట్ కార్యక్రమానికి నాయకత్వం వహించారు. ఆ సందర్భంగా హాజరైన అనేకమంది సినిమా నటులు, కవులు, నగర ప్రముఖుల మన్ననలను పొందారు. ఆయన బోధించిన శాస్త్రీయ ఆలోచన విధానం జిల్లాలో అనేక ప్రాంతాల్లో యువతీ యువకులను చైతన్య పరిచింది. ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్‌పై మంచి అవగాహన, నైపుణ్యం గల కార్మికునిగా పేరు ఉంది. ఆ నైపుణ్యంతో మన కార్యాలయాలు హష్మి భవనం, సత్తిరాజు భవన్, కొరటాల భవన్ (ప్రజాశక్తి) నిర్మాణాలకు సహకరించారు. ఇటువంటి బహుముఖ ప్రజ్ఞాశాలి, నిర్మాణ దీక్షితునికి ప్రజానాట్య మండలి విశాఖ జిల్లా కమిటీ తరపున నివాళ్లర్పిస్తున్నాం.

-జి.రమణ, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు

రమణారావు మృతి ప్రజాశక్తికి పూడ్చలేనిలోటు



కామ్రేడ్ పివైవి.రమణారావు మృతి ప్రజా ఉద్యమానికి, ప్రజాశక్తికి పూడ్చలేని లోటు. ప్రజాశక్తి పత్రిక పంపిణీ చేస్తూ ఆయన మృతి చెందడం చాలా బాధాకరం. బిహెచ్‌పివి ఉద్యోగిగా రిటైర్ అయిన తర్వాత కూడా పత్రికా క్యాంపెయిన్‌లోనూ, పంపిణీ చేయడంలోనూ ఆయన ఎంతో నిబద్ధతతో తన బాధ్యతలను నిర్వహించారు. నేను నివసిస్తున్న సమైక్య అపార్ట్మెంట్‌కు ఒక రోజున ప్రజాశక్తి పత్రిక పంపిణీ చేసే పేపర్ బాయ్ రాలేదు. ఆ సమయంలో ఆయనే స్వయంగా బయలుదేరి.. బోరున వర్షం కురుస్తున్నా ఆగక.. అంతటి వర్షంలోనూ రైన్ కోట్ ధరించి, పత్రికలను ప్లాస్టిక్ కవర్లో చుట్టుకొని వచ్చారు. ఆ వయసులో కూడా పత్రికను తీసుకురావడం ఆశ్చర్యం కలిగించింది. తగ్గిన తరువాత రావొచ్చుగా అని నేను అడిగాను. అందుకు ఆయన సమాధానమిస్తూ 'మీరూ, మీ సిబ్బంది ఎంతో కష్టపడి పత్రికను ముద్రించి పంపిస్తున్నారు. పత్రిక సరైన సమయంలో పాఠకులకు అందకపోతే మనం అనుకున్న లక్ష్యం ఎలా నెరవేరుతుంది' అని ఆయన అన్నారు. పత్రికా క్యాంపెయిన్ సందర్భంలో ప్రత్యేక కృషి చేసి పత్రికల పెంపుదలలో తన వంతు పాత్రను పోషించారు. ఎక్కడ మీటింగ్ జరిగినా, ఏ సందర్భంలో కలిసినా ప్రజాశక్తి పత్రిక మీద మాట్లాడుకోవడం జరిగేది. అంతటి కమిట్మెంట్‌తో ప్రజాశక్తి పత్రికను బాయ్‌లు రాని సమయంలో అనేక సందర్భాల్లో ఆయనే తీసుకురావడం చూశాను. చనిపోయిన రోజు కూడా యధావిధిగా పత్రికను మా సమైక్య అపార్టుమెంట్‌కు తీసుకొస్తూ గాజువాక పోలీస్ స్టేషన్ సిగ్నల్ దగ్గర ప్రమాదానికి గురై మృతి చెందడం చాలా బాధ వేసింది. ఆయన మృతికి ప్రజాశక్తి విశాఖపట్నం ఎడిషన్ తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం.

-ఎం.వెంకటేశ్వరరావు
జనరల్ మేనేజర్,
ప్రజాశక్తి, విశాఖపట్నం

గాజువాక ప్రజానాట్యమండలి నిర్మాణకర్త




పివైవి.రమణారావు మంచి కమ్యూనిస్టు. బిహెచ్‌పివి కార్మిక రంగంలోనూ, కమ్యూనిస్టు ఉద్యమాల్లోనూ ఆయనతో సుదీర్ఘ కాలంగా కలిసి పనిచేశాను. గాజువాక పట్టణంలోనూ, కార్మిక వాడల్లోనూ పార్టీ వ్యాప్తికి, ప్రజా సమస్యల పరిష్కారానికి, బహుముఖ ఉద్యమాల్లోనూ ఆయన ప్రత్యేక పాత్ర పోషించారు. గాజువాకలో ప్రజానాట్యమండలి కన్వీనర్‌గా నేను ఉన్నా అసలు కృషి అంతా రమణారావే నిర్వహించారు. ఒకసారి ఖరగ్‌పూర్ ఆంధ్రా అసోసియేషన్ నుంచి ఒక నాటిక ప్రదర్శించాలని బిహెచ్‌పివి ప్రజా నాట్యమండలికి ఆహ్వానం అందింది. అది 1993 లేక 1994 సంవత్సరంలో అనుకుంటాను. రమణారావు చొరవ తీసుకొని 'మొక్కు' అనే నాటిక రిహార్సల్స్ పూర్తిచేశాం. రమణారావు కథానాయకుని పాత్ర ధరించి ఖరగ్‌పూర్ వెళ్లి ప్రదర్శించాం. రిహార్సల్స్ సందర్భంలోనూ, నాటిక ప్రదర్శనలకు వెళ్లిన సందర్భంలోనూ ఆయన మనవడు (చంటిబిడ్డ) ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. అలాంటి ఆందోళనకర సందర్భంలోనూ తను నిబ్బరంగా ఉండి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ ఎప్పటికప్పుడు తగిన సూచనలు చేస్తూ, మరొక వైపు తన బృందం మంచిచెడులు చూసుకుంటూ ప్రదర్శనను పూర్తిచేసిన సందర్భం నాకిప్పుడు కళ్లముందు కదలాడుతోంది. ఆయన తన కర్తవ్యం పట్ల చూపిన నిబద్ధతకు ఇదొక నిదర్శనం. తన నటనకు ఉత్తమ నటుడిగా బహుమతి పొందారు. కమ్యూనిస్టు ప్రమాణాలు, విలువలు తన జీవితంలోనూ, కుటుంబ జీవితంలోనూ పాటిస్తూ, ప్రజాశక్తి పేపర్ పంచుతూ ప్రమాదానికి గురై మరణించడం నన్ను దిగ్భ్రాంతికి గురిచేసింది. కలిచివేసింది. రమణారావుకు జోహార్లు. వారి కుటుంబానికి నా సంతాపం ప్రకటిస్తున్నాను.

- ఎస్.నాగేశ్వరరావు, ప్రజానాట్య మండలి కళాకారుడు, బిహెచ్‌పివి విశ్రాంత ఉద్యోగి



నిరాడంబర జీవనశైలి రమణారావు సొంతం



1972లో బిహెచ్‌పివి ఫ్యాక్టరీలో అప్రెంటీస్ ఎలక్ట్రీషియన్లుగా కామ్రేడ్స్ రమణారావు, సిహెచ్ సత్యనారాయణలు చేరిన నాటి నుంచి హాస్టల్ మేట్సుగా నేటికీ 53 ఏండ్లుగా వీరిద్దరితో నాకు వ్యక్తిగతంగానూ, కార్మికోద్యమం, పార్టీ అనుబంధం రీత్యానూ సన్నిహిత సంబందాలు కలిగిన వాడిని. క్రమశిక్షణ, వ్యక్తిగత సౌశీల్యం, కుటుంబం పట్ల బాధ్యత, నిరాడంబర జీవనశైలి, నిక్కచ్చితనంగల రమణారావు కొంత ఆలస్యంగానైనా 1980 నాటికి ఆర్ఎస్ఎస్ భావజాలం నుంచి బైటపడి మార్క్సిస్టు పార్టీలో సభ్యునిగా చేరారు. సాధారణ దిగువ మధ్య తరగతి కుటుంబ నేపథ్యం కలిగిన రమణారావు కుటుంబం అంతటికీ అండగా ఉండి ముందుకు నడిపారు.

కార్మికుడిగా మంచి నిపుణత సాధించి తన తోటి కార్మికులలోనూ, అధికారుల లోనూ శభాష్ అనిపించు కున్నారు. త్వరగానే ఎలక్ట్రికల్ డిప్లమో ఉత్తీర్ణత సాధించారు. తను సూపర్ వైజర్, ఇంజినీర్ అధికారి అయ్యే అవకాశమున్ననూ తిరస్కరించి కార్మికుడిగానే ఉద్యోగ విరమణ చేశారు. ఇందుకు ప్రబల కారణం కార్మికుడిగా కార్మికోద్యమంలో స్వేచ్ఛగా పని చేయాలన్న సంకల్పమే. ఎలక్ట్రికల్ మెయింటినెన్సు డిపార్ట్‌మెంట్‌ను సిఐటియు కంచుకోటగా స్వామినాథం, గాంధీ, సత్యనారాయణ, సత్యారావు, అప్పలరాజు తదితరులతో కలిసి మార్చారు. రమణారావు సిద్ధాంత రాజకీయ అవగాహనతో సమస్యలపై ప్రచారాందోళనలు సాగించారు.

బిహెచ్‌పివిలో 1975లో 36 రోజులపాటు జరిగిన సమ్మె పోరాటం, 1980లో అక్రమ లాకౌట్ వ్యతిరేక పోరాటం, సిఐటియు పోరాట సమరశీలత చూసిన తర్వాత తొలుత సిఐటియు సమావేశాలకు, రాజకీయ తరగతులు, ప్రదర్శనలు, సభల్లో పాల్గొంటూ తన ఫ్యూడల్ భావజాలం నుంచి వైదొలిగి నిఖార్సయిన కమ్యూనిస్టుగా పరిణిత సాధించారు రమణారావు. పార్టీ కార్యక్రమాన్ని జీర్ణించుకుని, కమ్యూనిస్టు సిద్ధాంత బలంతో , వర్గ పోరాటం పట్ల అచంచల విశ్వాసంతో పార్టీ నిర్మాణంలో బిహెచ్‌పివి పరిరక్షణ ఉద్యమంలో, గాజువాక ప్రజా సమస్యల ఉద్యమాలలో నిశ్శబ్దంగా ప్రచార ఆందోళనకారుడుగా అవిశ్రాంతంగా నాలుగున్నర దశాబ్దాలకు పైగా ఆవిరళ కృషి సాగించారు. రమణారావు నిరంతర సాహిత్య అధ్యయన శీలి. ఆయనకు కార్మికలోకం, మార్క్సిస్టు మాస పత్రిక, ప్రజాశక్తి దినపత్రిక మానస పుత్రికలు. ఫ్యాక్టరీలోపల, గాజువాక, ప్రాంతంలోనూ వీటి ఏజెన్సీలు, పంపకం తద్వారా పాఠకులతో సజీవ సంబంధాలు తన 73వ ఏట ముగింపు వరకు కలిగి ఉండటం ఆయన కమ్యూనిస్టు పరిణిత చైతన్యానికి నిదర్శనం.

సామాజిక, ఆర్థిక, రాజకీయ సంబంధాలతో కూడిన వర్గ సమాజం పట్ల సంపూర్ణ అవగాహన పెంచుకున్నారు. అసమానతలు లేని కొత్త ప్రపంచం ఏర్పాటు చేసుకోవాలని ఆయన వర్గాలు- వర్గ పోరాటాలు క్లాసు సుబోధకంగా బోధించేవారు.

సుదీర్ఘకాలం పార్టీ శాఖా కార్యదర్శిగా, బిహెచ్‌పివి ఫ్యాక్టరీ కమిటీలో కొంత కాలం సభ్యునిగా, గాజువాక డివిజన్ పార్టీ కమిటీ సభ్యుడిగా, కోశాధికారిగా పలు బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహించారు. కామ్రేడ్ సుబ్బారావు, రాజేంద్ర ప్రసాద్, కిరీటం, వై.సత్యనారాయణ తదితరులతో గాజువాకలో పార్టీ నిర్మాణ బాధ్యతలు పంచుకున్నారు.

చైతన్యనగర్, స్నేహపురి, మొదలగు కాలనీలకు దేముళ్ల పేర్లు కాకుండా అభ్యుదయ పేర్లు సూచించి అందరి ఆమోదం పొందడం జరిగింది. విశాఖపట్నంలోని కాలనీల అసోసియేషన్లు, అపార్టుమెంటు సంఘాలతో వాటి సమస్యల పరిష్కారంపై పాల్గొన్నారు రమణారావు. అతి కొద్ది స్థలం కొని చిన్న ఇల్లు నిర్మించుకుని పార్టీ ఆఫీస్ నిర్మాణంలోనూ, అక్కడ ఇరుగు పొరుగు నివాశితులతోనూ సామరస్య సోదర సంబంధాలు నెరిపేవారు.

ఆంధ్ర ప్రజానాట్య మండలిలో చురుకైన పాత్ర పోషించిన ముఖ్య కార్యకర్త, మంచి నటుడుకూడా. పలు నాటికల్లో నటించడమేగాక, కొన్ని బహుమతులు కూడా పొందారు. కళాబృందాలు, అక్షర జాతాలు, బృంద నాట్యాలు జయప్రదం చేయడంలో తెర వెనుక నాయకుడిగా రమణారావు పని చేసేవారు.

పార్టీ శాఖా సమావేశాలకు కచ్చితంగా అందర్నీ హాజరు పరిచేవారు. రాజకీయ సిద్ధాంత చర్చలను నిరంతరం జరిపేవారు.
ఎప్పటికప్పుడు మారే రాజకీయ పరిమాణాల పట్ల అందరిలో అవగాహన పెంచేవారు. అందరితో ఆత్మీయతతో వ్యవహరించేవారు. పార్టీ లెవీ చెల్లింపులో తన ఆదాయం ఖచ్చితంగా లెక్కించి పార్టీకి జమ చేసేవారు. మొహమాటం లేకుండా పార్టీ విధానం పట్ల తన అభిప్రాయాలు చెప్పేవారు. పార్టీ పరిధికి కట్టుబడి చర్చించేవారు. బివి. రాఘవులు, సిహెచ్ నర్సింగరావు రమణారావు పట్ల అభిమాన పూర్వకంగా ప్రేమాస్పదంగా వ్యవహరించేవారు.

రిటైర్డ్ అయిన తర్వాత తనకొచ్చే అతి స్వల్ప పింఛను కుటుంబ పోషణకు ఏమాత్రం చాలదు. అటువంటి పరిస్థితుల్లో ప్రైవేట్ ఐటిఐ ఇన్‌స్ట్రక్టర్‌గా గత 15 ఏళ్లుగా పని చేస్తూ విద్యార్థులకు మంచి శిక్షణ ఇస్తూ రోజులో మిగిలిన సమయమంతా పార్టీ కోసం వెచ్చిస్తూ వచ్చారు. ఒక సందర్భంలో ఆ సంస్థ యాజమాన్యం తన సిబ్బంది, అధ్యాపకుల్ని తొలగిస్తే తాను కూడా రాజీనామా చేశారు. వారి హక్కుల రక్షణకై ధృడంగా నిలబడ్డ రమణారావును వదులుకోవడం ఇష్టంలేక అందరినీ పనుల్లోకి తీసుకోవడం జరిగింది. ఇది తోటి వారి పట్ల చూపిన రమణారావు పోరాట పటిమ.

తన భార్య సుభద్రాదేవిని ఐద్వా మహిళా ఉద్యమంలోకి, తన కుమార్తెలను ఎస్ఎఫ్ఐ విద్యార్థి ఉద్యమాల్లోకి తీసుకొచ్చారు. తను యువకునిగా ఉన్నప్పుడే టిబి వ్యాధి సోకింది. వైద్యం పొందుతూ తన ఆనారోగ్యం నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకంటూ, కంపెనీ కార్మికుడిగా, బయట ఉద్యమాల్లో తప్పక పాల్గొంటూ వచ్చారు. సీనియర్ కార్యకర్తగా పార్టీ కృషిలో భాగంగా ప్రజాశక్తి పంచుతూ ఆకస్మిక ప్రమాదంలో ఆయన మృతిచెందడం పార్టీకి, ఆయన కుటుంబానికి, మాలాంటి వారికి విషాదం తెచ్చి పెట్టింది. ఇది జరగకపోయి ఉంటే మరొక దశాబ్ధకాలం ఢోకా లేకుండా కృషి చేసి ఉండేవారనటంలో సందేహం లేదు. ఎందుకంటే తన జీవితాన్ని క్రమశిక్షణతో తీర్చిదిద్దుకొన్న గొప్ప కామ్రేడ్ రమణారావు.

నాకు రమణారావుకు 53 ఏళ్ల ఆత్మీయ అనుబంధం ఉంది. ఆయన మృతి ఎంతగానో కలచివేసింది. పార్టీ ఉద్యమంలోనూ పది కాలాల పాటు మనందరిలో జీవించి ఉండే ధన్యజీవి రమణారావు. సుభద్రాదేవికి, వారి కుటుంబ సభ్యులకు నా సంతాపం, ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, విప్లవ జోహార్లు అర్పిస్తున్నాను. కార్మికోద్యమం నుంచి బిహెచ్‌పివిలో పుట్టి మెరిసిన మణిమాలకు లాల్ సలాం

– జంపాల శ్రీమన్నారాయణ,
బిహెచ్‌పివి ఫ్యాక్టరీ కమిటీ మాజీ కార్యదర్శి.







విలువలతో.. కూడిన విద్య నేర్పించారు

సెయింట్ అలోసిస్ ఐటిఐలో రమణారావు విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను నేర్పించారు. 2009వ సంవత్సరంలో ఎలక్ట్రీషన్ టీచర్‌గా ఐటిఐలో చేరారు. ఆ రోజు నుంచి చనిపోయిన వరకు పనిచేశారు. ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారు. ఆయన దగ్గర చదివిన విద్యార్థులు నేడు మంచి కంపెనీల్లో స్థిరపడ్డారు. చాలామంది విద్యార్థులు మంచి ఉద్యోగాల్లో చేరారు. విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంలో ఆయనకు సాటి మరెవరూ లేరు. ఆయన చనిపోవడం చాలా బాధాకరం. సెయింట్ అలోసిస్ ఐటిఐకి తీరని లోటు. క్రమశిక్షణ కలిగిన వ్యక్తి. పదిమందికి సేవ చేయాలన్న తపన కలిగిన వ్యక్తి.

- ఎన్.కొండారెడ్డి
సెయింట్ అలోసిస్ ఐటిఐ మేనేజర్

తుదిశ్వాస వరకూ నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడ్డారు



రమణారావుగారు తాను నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస వరకూ పని చేశారు. తను చేసే ప్రతి పనిలోను సిద్ధాంతాన్ని ఇముడ్చుకున్నారు. కుటుంబ కార్యక్రమాలకు, పార్టీ కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యత ఇచ్చారు. చేసే పని చిన్నదా, పెద్దదా అని కాకుండా అది పార్టీ పిలుపా, కాదా అని మాత్రమే చూశారు. ఆయన ప్రజాశక్తి దిన పత్రికను పార్టీ ఊపిరిగా భావిస్తారు. అందుకే ఎట్టి పరిస్థితుల్లోనూ పత్రికను అందరికీ సకాలంలో అందించాలని తపన పడేవారు. ఇంటికి పార్టీ సభ్యులు, సానుభూతిపరులెవరొచ్చినా కుటుంబ సభ్యుల్లాగా భావించేవారు. నిరాడంబరంగా జీవిస్తూ ప్రజలతో మమేకమై ఉండటం రమణారావుగారివల్లే నేర్చుకున్నాను. ఆయనతో కొనసాగిన నా ప్రయాణం, ఆయన చూపిన మార్గం నాకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకం.

- పి.సుభద్రాదేవి, భార్య

నన్ను ప్రజాశక్తిలో చేర్పించారు



ప్రజాశక్తిని ఒక శక్తిమంతుడైన కార్యకర్తగా నాన్న భావించేవారు. ఏమాత్రం అవకాశం ఉన్నా అందరూ ప్రజాశక్తికి సమయం కేటాయించి పని చేయాలని కోరేవారు. నేను జర్నలిజంలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసి బయట ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్నప్పుడు ప్రజాశక్తిలో చేరే విధంగా నాన్న ప్రోత్సహించారు. మన పత్రిక ఉండగా బయట సంస్థల్లో పని చేయడం ఎందుకని అనడంతో ప్రజాశక్తిలో చేరాను. ఆ తరువాత పార్టీ ఆధ్వర్యంలో 10 టీవీ ఏర్పాటు చేసినప్పుడు అందులోకి వెళ్లేందుకు కూడా ప్రోత్సహించారు. నాన్న ఎప్పుడూ పార్టీకే మొదటి ప్రాధాన్యత ఇచ్చేవారు.

- ఐ.సుకన్య, కుమార్తె

నాకు ఊహ తెలిసినప్పటి నుంచీ ప్రజాశక్తి బాధ్యతలే



నాకు ఊహ తెలిసినప్పటి నుంచీ నాన్న ప్రజాశక్తి బాధ్యతలే నిర్వహించేవారు. ఆయన ఎక్కడ ఉద్యోగం చేసినా డ్యూటీ తరువాత ప్రజాశక్తి సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేసేవారు. ఎక్కడైనా పార్టీ సమావేశాలు జరుగుతుంటే అక్కడికి ప్రజాశక్తి సాహిత్యాన్ని తీసుకెళ్లి స్టాల్ పెట్టి అందరికీ అందే విధంగా పని చేసేవారు. సంతల్లో కూడా స్టాల్ పెట్టి పుస్తకాలు అమ్మేవారు. విజయవాడ నుంచి క్యాటలాగ్స్ తీసుకొచ్చి దాని ప్రకారం పుస్తకాలను వేరు చేసి భద్రపరిచేవారం. క్యాటలాగ్ వస్తే ఇంట్లో మాకొక పండుగ వాతావరణంగా ఉండేది. నాన్న నిర్వహించే ప్రజాశక్తి బాధ్యతల్లోనే నా బాల్యం మొత్తం గడిచింది.

- కె.చైతన్య, కుమార్తె

మార్గదర్శిని కోల్పోయా



రమణారావు గారు నాకు మామగారితోపాటు మార్గదర్శి కూడా. నేను నిబద్ధతతో జీవించడానికి ఆయన ప్రేరేపించిన అంశాలు ఎన్నో ఉన్నాయి. ఏ సమస్య ఎదుర్కోవాల్సి వచ్చినా ఆయన సలహాలు నన్ను విజయవంతంగా నడిపించేవి. నేను ప్రజాశక్తిలో పనిచేస్తున్నానన్న ఒకే ఒక్క కారణంతో తమ పెద్ద కుమార్తెను నాకు ఇచ్చి వివాహం జరిపించారు. ఆ తరువాత మా ప్రతి కష్టంలోను ఆయన మాతో ఉన్నారు. మేము కింద పడిపోకుండా పట్టుకున్నారు. ఆయన మరణం మాకు తీరని లోటు. అయినప్పటికీ ఆయన మాకిచ్చిన స్ఫూర్తి ముందుకు నడిపిస్తుందని భావిస్తున్నాను.

- కె.ప్రదీప్ నాయుడు (కేపీ), అల్లుడు

రమణారావు జ్ఞాపకాల దృశ్య మాలిక



బహుమతి అందుకుంటూ...



మిర్యాలగూడలో జరిగిన క్లాసుల్లో..



సహచరులతో కలిసి..



సత్కారం అందుకుంటూ..



నాటకాన్ని రక్తి కట్టిస్తూ..



ఓ కార్యక్రమంలో ప్రసంగాన్ని వింటూ..

స్ఫూర్తి ప్రదాత.. రమణారావు



తొలి నుంచీ రమణారావు క్రమశిక్షణ కలిగిన వ్యక్తి. 74 ఏళ్లలో కూడా పార్టీ అప్పగించిన పనిని బాధ్యతాయుతంగా చేసేవారు. ప్రజాశక్తి పత్రికను పేపర్ బాయ్ రాని సమయంలో ఆయనే స్వయంగా పంపిణీ చేసేవారు. కుటుంబాన్ని ఆదర్శబాటలో నడిపారు. మార్క్సిస్టు పాఠాలను సులువుగా బోధించేవారు. 1992 నుంచి దాదాపు పదేళ్ల శాస్త్రీయ ఆలోచన పాఠాన్ని ఆయనే చెప్పేవారు. అప్పట్లో ఆ పాఠాన్ని చక్కగా బోధించేవారిలో ఆయనొకరు. కుమార్తెలైన చైతన్య, సుకన్యలను విద్యార్థి ఉద్యమంలో భాగస్వామ్యం చేశారు. పిల్లల అభిప్రాయాలను ఎల్లప్పుడూ గౌరవించేవారు. కార్యకర్తలకు ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే జోక్యం చేసుకుని పరిష్కారానికి కృషి చేసేవారు. బిహెచ్‌పివిలో ఉద్యోగ విరమణ చేసిన తరువాత ఓ విద్యాసంస్థలో పాఠాలు బోధిస్తూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారు. వారితో ఆప్యాయంగా మెలిగేవారు. అందుకే రమణారావు మృతి వార్త తెలిసిన వెంటనే విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అంతిమయాత్రలో పాల్గొని గురువుగారికి కన్నీటి వీడ్కోలు పలికారు.

రమాణారావు కుటుంబాన్ని ఆదర్శవంతంగా నడిపారు. మహిళలను ఉద్యమాల్లో ప్రోత్సహించారు. ఆయన భార్య సుభద్ర ఎన్నో పోరాటాల్లో పాల్గొన్నారు. గాజువాకలో జరిగిన ఉద్యమాల్లో భాగస్వాములయ్యారు. రమణా రావు అధ్యయనశీలి.

కార్యకర్తల్లో పొరపాటు ఉంటే నిర్మొహమాటంగా చెప్పి ఆ పొరపాటును సరిచేసేవారు. కార్మిక రంగంలో సుదీర్ఘకాలం పనిచేసినా నాయకత్వ బాధ్యతల్లో ఎన్నడూలేరు. తెర వెనుకన ఉండి అంతటినీ నడిపించిన మార్గదర్శకుడు. సిపిఎం ఇచ్చిన అన్ని పిలుపుల్లో పాల్గొనేవారు. ప్రజాశక్తి పత్రికా క్యాంపెయిన్‌లోనూ, పత్రిక పంపిణీలోనూ చురుగ్గా వ్యవహరించారు. పేపర్ బాయ్ రాకుంటే పత్రికను ఆయనే స్వయంగా పంపిణీ చేసేవారు. ఆ క్రమంలోనే రోడ్డు ప్రమాదానికి గురై ఇటీవల కన్నుమూశారు.

ఆయన పార్థివ దేహాన్ని విద్యార్థుల పరిశోధన నిమిత్తం ఆంధ్రా మెడికల్ కాలేజీకి ఇద్దామని అనుకున్నా రోడ్డు ప్రమాదానికి గురవడంతో కుదరలేదు. తుదకు ఆయన కళ్లను కుటుంబీకులు దానం చేశారు. ఎంతో ఆదర్శవంతంగా బతికిన రమణారావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయడమే ఆయనకిచ్చే ఘనమైన నివాళి.

- కె.లోకనాథం,
సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు

అలుపెరుగని బాటసారి

వందనమయా కడసారి



ఓ చైతన్య ప్రదాత
కార్మికోద్యమ నిర్మాత
కళారంగ ప్రయోక్త
అలుపెరుగని బాటసారి
వందనమయా కడసారి

అశయాల బాటలోన
అమరులేందరో
సమర శీల పోరాటాల
ధీరులెందరో
ప్రజల కోసం పోరు చేసే ధన్యులెందరో
బ్రతుకే ఉద్యమైన త్యాగులేందరో
అరుణపథ క్రాంతి వయా రమణారావు

అందుకో మా వందనం
రమణారావు

ఒక తరం తరలి పోయింది
ఒక స్వరం ఆగి పోయింది
తరం అగిపోయిన
స్వరం మూగబోయిన
ఆగదు ఆగదులే మీ
ఉద్యమ జ్వాల
అమరుడా రమణారావు
జోహార్లయా విప్లవ జోహార్లయా!

మీ చిరునవ్వే చిరునామా
మీ ఉద్యమమే
వీలునామా
మీ నిబద్ధతే ఆభరణం
ఆ వారసత్వ స్ఫూర్తిని
ఎద ఎదలో నింపుకొని
మీ పాటలే పాడుతాం
మీ అటలే అడుతాం
ఓ.. ధన్యజీవి
ఓ.. పుణ్య జీవి
అందుకోండి అశ్రునయన అరుణాంజలి
పీడిత జన ప్రజల
భాష్పాంజలి

- ఎస్‌జిఎం.బాషా